




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








వరంగల్ | 02-07-2026 గురువారం | సంపుటి : 11 | సంచిక : 212 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


## ఢిల్లీలో ఇజ్జత్ లేకపోతే

# ఎందుకు పోతున్నవ్

**ఢిల్లీకి పోతే గౌరవం లేదని చెప్తడు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**నువ్వు నడుపుతున్న రాష్ట్రాన్ని నువ్వే తిట్టడం ఏం దరిద్రం**

**ఇంత విచిత్రమైన పరిస్థితి దేశంలో ఏ నాయకుడు కూడా ఇలా ఉండడు**

**ఇంకా ఎన్ని రోజులు ఆ విషం చిమ్మే పని మాకైతే అర్థం కావడం లేదు**



* కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపో తోంది. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయే నాటికి రూ.3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోం దంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్న.. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి: కెటిఆర్



## ఆదాయ సమీకరణపై ఫోకస్ పెట్టండి

**భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలి**

**అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి**

**లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలి**



**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

**హైదరాబాద్, జులై 1 (వుదయం ప్రతినిధి) :** ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు.హెచ్ఎండిఎ,టిజిఐఐసి కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలో అప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖ వారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఎ1 టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. 2లో

## అమెరికా సుప్రీం కోర్టు తీర్పు

# చారిత్రాత్మకం

**జన్మతః పౌరసత్వంపై 'సుప్రీం' తీర్పు • భారతీయ అమెరికన్ల హర్షం**



**ఈ తీర్పు అమెరికాలోని వలస కుటుంబాలకు గొప్ప భరోసా**

**ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతన్ పటేల్**

**తీర్పు 'చరిత్రాత్మక విజయం**

**ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ లీడర్ అజయ్ జైన్ బుటోరియా అభి**

**వాషింగ్టన్, జులై 1 :** విదేశీ వలసదారుల పిల్లల పౌరసత్వాన్ని పరిరక్షిస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై భారతీయ అమెరికన్ల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని అమెరికన్లుగానే పరిగణించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీనిపై ఇండో అమెరికన్లు హర్షం చేస్తున్నారు. ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతన్ పటేల్ మాట్లాడుతూ.. ఈ తీర్పు అమెరికాలోని వలస కుటుంబాలకు గొప్ప భరోసా కల్పించిందన్నారు. ట్రంప్ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ప్రత్యక్షంగా ప్రభావితం అయ్యేది భారత్, దక్షిణాసియా వలస కుటుంబాలేనన్నారు. అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు 'చరిత్రాత్మక విజయం' అని ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ లీడర్ అజయ్ జైన్ బుటోరియా అభివర్ణించారు. దాదాపు 52 లక్షల మంది ఇండో అమెరికన్లలో 12 లక్షల మందికి పైగా ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఎఫ్ఐఐడీఎస్ మిగతా 2లో

## బిజెపి చేస్తున్న కుట్రలను

# తిప్పి కొట్టాలి

**ఓట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత బూత్ ఏజెంట్లదే**

**కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది**

**సిఎం రేవంత్ రెడ్డి మాటల్లోనే ఓటమి భయం**

**బీఆర్ఎస్ కి, కరీంనగర్ గడ్డకు విడదీయరాని పేగుబంధం**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు**



**కరీంనగర్, జులై 1 (వుదయం ప్రతినిధి) :** 2034 దాకా నేనే సీఎం అంటూనే, అధికారం శాశ్వతం కాదు అని రేవంత్ రెడ్డి మాట్లాడటం ఆయనలో ఉన్న ఓటమి భయం కనిపిస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. 30 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టి, వేములవాడ రాజన్న సాక్షిగా రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌ను రైతులు కాగడాలు పట్టుకుని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం కొండ సత్య లక్ష్మీ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అలాగే ఓటరు నమోదు ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రైతు డిక్లరేషన్‌లో ఒక్క హామీ కూడా అమలు చేయకుండా, అడుగడుగునా వంచించినందుకు రైతులు నిన్ను కంచె వేసి కాపాడాలా రేవంత్ రెడ్డి? రైతులను, పాడిని కాపాడిన కేసీఆర్ 'పశుపతి' రాష్ట్రాన్ని ఆగం చేస్తున్న రేవంత్ రెడ్డి ఒక మిగతా 2లో

## వీబీ జీరామ్‌జీ వేతనాల పెంపు

* నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం
* రోజువారీ వేతనాన్ని కనిష్ఠంగా రూ.300 నుంచి గరిష్ఠంగా రూ.409 చెల్లింపు
* సిక్కింలోని కొన్ని పంచాయతీల్లో అత్యధికంగా రూ.450 వేతనం



**న్యూఢిల్లీ, జులై 1 (వుదయం బ్యూరో) :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ చట్టం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచుతూ తీసుకొచ్చిన ఈ చట్టం కింద చెల్లించే వేతనాలను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. రోజువారీ వేతనాన్ని కనిష్ఠంగా రూ.300 నుంచి గరిష్ఠంగా రూ.409 చెల్లించేలా నిర్ణయించింది. సిక్కింలోని కొన్ని పంచాయతీల్లో మాత్రం అత్యధికంగా రూ.450 వేతనం చెల్లించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అవసరమైతే ఇరాన్‌పై

# మరోసారి దాడి

**మూడోసారి దాడులు చేయడానికి కావాల్సిన సామర్థ్యం మా సైనిక దళాలకు ఉంది**

**ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తాం**

**అణు కార్యక్రమాలను నిలిపివేయడంపై దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నాయి**

**ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ సైనిక చర్య : ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**



**ఇజ్రాయెల్, జులై 1 :** పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ కోసం ఇరాన్‌తో అమెరికా చర్చలు జరిపేందుకు సిద్ధమవుతోన్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ అణు కార్యక్రమంపై కఠిన వైఖరి అనుసరిస్తామని.. అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడి చేస్తామని హెచ్చరించారు. మూడోసారి కూడా దాడులు చేయడానికి కావాల్సిన సామర్థ్యం తమ సైనిక దళాలకు ఉందని పేర్కొన్నారు. గతంలో ఆ దేశంపై చేపట్టిన సైనిక చర్యలను నెతన్యాహు సమర్థించుకున్నారు. ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించకుండా నిరోధించే విషయంలో తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకోసం ఇతర దేశాలపై ఆధారపడబోమంటూ పరోక్షంగా అమెరికాను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. అణు కార్యక్రమాలను నిలిపివేయడంపై దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. అందుకు ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ సైనిక చర్య తప్పదని హెచ్చరించారు. తమ దేశానికి భద్రతాపరమైన ముప్పు తెచ్చే ఎటువంటి చర్యలనైనా అడ్డుకొని తీరుతామని పునరుద్ఘాటించారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగించేలా ఉండే ఒప్పందాలను ఇజ్రాయెల్ ఎప్పటికీ స్వాగతించబోదన్నారు. లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని.. లేదంటే ఒప్పందం కుదుర్చుకోబోమని ఇరాన్ చెబుతోంది. కానీ, నెతన్యాహు మాత్రం తుది ఒప్పందం కుదిరే దాక ఇజ్రాయెల్ బలగాలు బీరుట్‌లోనే ఉంటాయని ఇప్పటికే వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు.

## 5 రోజులుగా శిథిలాల కిందే

# కుక్క పిల్ల

**భూకంపాల కారణంగా ఇప్పటివరకు 1,943 మంది ప్రాణాలు కోల్పోయారు**

**మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం**




**కరాకస్, జులై 1 :** వెనెజువెలా రాజధాని కరాకస్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో గత నెల 24వ తేదీన వరుస భూకంపాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ భూకంపాల కారణంగా ఇప్పటివరకు 1,943 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 10,571 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద ఇంకా వేలాది మంది చిక్కుకుపోయారు. మిగతా 2లో

## సిసి కెమెరాలకు చిక్కకుండా.. ఇంటి దొంగల

# మాస్టర్ ప్లాన్

**చోరీ చేసిన సొమ్మును వాష్‌రూమ్‌లో దాచారు**

* అయోధ్య ఆలయంలో ఇంటిదొంగల ఉపాయం
* సునాయాసంగా సొమ్ము బయటకు తరలింపు
* ఎవరికి కనబడకుండా తీసుకెళ్లారు : పోలీసులు



**అయోధ్య, జులై 1 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య విరాళాల అపహరణపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులను విచారించారు. పలు కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆలయంలోని విరాళాల లెక్కింపు వ్యవస్థలో లోపాలను ఆసరాగా చేసుకున్న ఈ ఇంటిదొంగలు.. చాలా సునాయాసంగా సొమ్ము బయటకు తరలించినట్లు తెలుస్తోంది. దొంగలించిన సొత్తును వాష్‌రూమ్‌ల్లో దాచి.. ఎవరికీ కనబడకుండా తీసుకెళ్లినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు అనుమతితో నిందితుల్లో ఒకడైన అవినాష్ శుక్లాను పోలీసులు మంగళవారం రెండు గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా అతడు కీలక విషయాలు బయటపెట్టినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. విరాళాల కౌంటింగ్ గదికి ఉన్న తాళాలను మరో నిందితుడు టిన్నూ యాదవ్ సంపాదించాడు. అనంతరం ఎవరూ లేని సమయంలో ఆ గదిలోని డబ్బును చోరీ చేశామని శుక్లా తెలిపినట్లు సమాచారం. ఇక ఆలయ ప్రాంగణంలో ఎక్కడెక్కడ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి.. వాటిని ఎవరు పరిశీలిస్తారన్న వివరాలు నిందితులకు బాగా తెలుసు. దాన్ని అనువుగా తీసుకున్న నిందితులు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా చోరీ చేసిన సొమ్మును వాష్‌రూమ్‌ల్లో దాచిపెట్టినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఆ తర్వాత సమయం చూసుకుని మిగతా 2లో

## ట్రాఫిక్ సిగ్నల్స్‌ను

# ఇంటిగ్రేట్ చేయాలి

**ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి**

**వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎ1) సాంకేతికతతో అనుసంధానం చేయాలి**

**ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జులై 1 (ఎఎంస్) :** హైదరాబాద్ మహా నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అనలాగ్, మెగా ఇంజనీరింగ్ సంస్థలకు సూచించారు. అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ రెండు సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో దేశంలో అమలు చేయనున్న ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థపై సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎ1) సాంకేతికతతో అనుసంధానం చేయాలని చెప్పారు. మిగతా 2లో



## ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఇంటిగ్రేట్ చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , సలహాదారు కె రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యంత్రాల ద్వారా వాస్తవిక పరిస్థితులను గ్రహించడం, పరిస్థితులను అర్థం చేసుకుని దానికి అనుగుణంగా చర్యలు తీసుకునే సామర్థ్యం కలిగిన ఫిజికల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని అనలాగ్ ప్రతినిధులు ఈ సమావేశంలో వివరించారు. ఈ విధానం ముందుగా నిర్దేశించిన ప్రోగ్రామింగ్‌పై ఆధారపడకుండా, నిరంతర అభ్యాసం ద్వారా స్వయంగా అభివృద్ధి చెందే వ్యవస్థ అని వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే ఈ సాంకేతిక వ్యవస్థ పూర్తిగా నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెన్స్ సదుపాయమని పేర్కొంటూ హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలు, వాటి ప్రయోజనాలను సమావేశంలో తెలిపారు.

## ఆదాయ సమీకరణపై ఫోకస్ పెట్టండి

మొదటి పేజీ తరువాయి

వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 5 రోజులు శిథిలాల కిందే కుక్క పిల్ల

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. శిథిలాల కింద చిక్కుకుపోయిన మనుషులు, మూగ జీవాలను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జిసెల్లే అనే కుక్కపిల్లను సహాయక సిబ్బంది శిథిలాల కిందనుంచి బయటకు తీశారు. ఆ కుక్కపిల్ల 5 రోజులు శిథిలాల కింద నీళ్లు, ఆహారం లేకుండా అల్లాడిపోయింది. సహాయక సిబ్బంది దాన్ని బయటకు తీసిన వెంటనే సిరంజి ద్వారా ఆహారాన్ని అందించారు. ఆ కుక్కపిల్ల యజమానులు ఎవరన్నది తెలియరాలేదు. ప్రస్తుతం కుక్కపిల్లకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో.. 'తనను బయటకు తీసిన సహాయక సిబ్బంది ముఖాన్ని కుక్కపిల్ల ఎంతో ప్రేమతో నాకింది. శిథిలాల నుంచి పక్కకు తీసుకువచ్చిన తర్వాత వైద్య సిబ్బంది దానికి సిరంజితో ఆహారం అందించారు. అది ఎంతో వేగంగా ఆహారాన్ని తినసాగింది. ఇక, ఈ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. 'ఈ కుక్కపిల్ల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది'.. 'ప్రాణం పోయే వరకు నమ్మకం కోల్పోకూడదని ఈ కుక్కపిల్ల మనకు నేర్పిస్తోంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

**వుదయం, మిరుదొడ్డి (జూలై 1) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా మిరుదొడ్డి మండల కేంద్రంలో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టారు. సర్పంచ్ ఏలుముల మహేశ్వరి దేవరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు మురికి కాల్వలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ సిబ్బంది రోజువారీగా చెత్త సేకరణ, మురికి కాల్వల శుభపరిచే పనులు చేస్తున్నారని, ప్రజలు కూడా సహకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతోపాటు, సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

**అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల జూలై 01 (వుదయం బ్యూరో) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించి, వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.



బుధవారం గద్వాల పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా సదుపాయాలు, తరగతి గదులు, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, ఇతర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల వంటశాలను సందర్శించి, ఆహార తయారీ విధానం, పరిశుభ్రత ప్రమాణాలు,నిల్వ చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని, వంటశాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్ భవాని, అధ్యాపకులు, వార్డెన్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఇజ్జత్ లేకపోతే ఎందుకు పోతున్నవ్

**హైదరాబాద్, జులై 1 (వుదయం ప్రతినిధి) :** ఒక అంగుష్ఠ మాత్రుడు.. ఒక తుచ్ఛుడు ఈ రోజు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల, ఈ రాష్ట్రం దురదృష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎంతటి అల్పుడైనా.. ఎంతటి తుచ్ఛుడైనా నిజానికి నేను దరిద్రుడిని అనే మెడలో బోర్డు వేసుకుని తిరుగడు. కానీ రేవంత్‌రెడ్డి స్పెషాలిటీ ఏంటంటే ఆయన మైకు మీదనే నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటడన్నారు. దివాళా తీశాం.. దివాళా తీశాం.. ఒక్కసారి కాదిది. రెండున్నరేళ్లలో ఒకసారి తెలంగాణను ఎయిడ్స్ రోగి అంటడు. ఇంకోసారి క్యాన్సర్ పేషంట్ అంటడు.. దివాళా తీసిందని మాట్లాడిన దివాళాకోరు మాటలకైతే లెక్కనే లేదు. అది చూసిన తర్వాతనే బాధ అనిపించింది. వాస్తవమేంటంటే ఇంతటి భావదారిద్ర్యం బహుశా దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రిలో కూడా ఎన్నడూ చూసి ఉండం. మీ అదృష్టం బాగుంది.. జాక్‌పాట్ కొట్టారు. ప్రజలు మార్పు అని మీరు చెప్పిన డైలాగులు విశ్వసించారు. మీకు అవకాశం ఇచ్చారు. 30 నెలలు అయిపోయింది.. మీ పరిపాలనకు 50 శాతం మీకిచ్చిన అవకాశం అయిపోయింది.. ఇప్పటికైనా ప్రజలకు మీ ప్రభుత్వంలో మీరేం చేశారో నాలుగు మంచి మాటలు చెప్పండని కేటీఆర్ హితవు పలికారు. ప్రజలకు మీరిచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు. లేదంటే ఒక జిల్లాకు పోతే ఆ జిల్లాకు మీరు చేసిన అభివృద్ధి.. మీ వల్ల జరిగిన మంచి పనులు అవి చెప్తారేమో అని చూస్తున్నం. కానీ ఇంత రాజకీయ భావదారిద్ర్యం, ఇంత విచిత్రమైన పరిస్థితి భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఏ నాయకుడు కూడా ఇలా ఉండడు.. ఎంతో మందిని చూశాం.. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులను చూశాం.. కానీ ఎవరిలో కూడా ఇంతటి భావదారిద్ర్యం మేమైతే చూడలేదు. తింటున్న అన్నంలోనే మన్ను పోసుకున్నట్టు.. తింటున్న అన్నంలోనే ఊంచినట్టు నువ్వు నడుపుతున్న రాష్ట్రాన్నే తిట్టడం ఏం దరిద్రం. ప్రభుత్వానికి అధినేత, రాష్ట్రానికి ముఖ్యమంత్రి నువ్వు. ఇంకా ఎన్ని రోజులు ఆ విషం చిమ్మే పని మాకైతే అర్థం కావడం లేదన్నారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదు.. అక్కడ గౌరవం లేదని ఆయనే చెప్తడు. మరి 72 సార్లు ఎందుకు పోతున్నవ్. ఏ ముఖ్యమంత్రి ఇంతవరకూ సాధించని రికార్డు నువ్వే సృష్టించినవ్. 30 నెలల్లో 72 సార్లు అంటే సగటున నెలకు కనీసం రెండున్నర సార్లు ఢిల్లీకి పోతున్నవ్. ఎవరు రమ్మంటున్నరు మరి.. నిన్ను అక్కడ.. ఢిల్లీలో ఇజ్జత్ లేకపోతే ఎందుకు పోతున్నవ్ అని అడుగుతున్నానన్నారు.

# బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి

మొదటి పేజీ తరువాయి

'భూతుపతి'డిసెంబర్ 2023లో తెలంగాణకు రేవంత్ రెడ్డి రూపంలో పట్టిన అతిపెద్ద 'ఎల్‌నినో'ను తరిమికొట్టాలి. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో బురద రాజకీయాలు మాని.. తక్షణమే కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి పంటలు కాపాడాలన్నారు. ఇతర రాష్ట్రాల తరహాలో ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి.. ఓట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత బూత్ ఏజెంట్లదేనని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి, కరీంనగర్ గడ్డకు విడదీయరాని పేగుబంధం ఉంది. తెలంగాణ మలిదశ ఉద్యమానికి, తొలి సింహగర్జనకు, కేసీఆర్ ఆమరణ దీక్షకు వేదికైన నేల ఇది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. సీఎం రేవంత్ రెడ్డి మాటల్లోనే ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధికారం శాశ్వతం కాదు అని రేవంత్ అనడమే ఆయన జారుడుబండ మీద ఉన్నాడని నిరూపిస్తోంది. రైతులకు ఏ మేలు చేశారని రేవంత్ రెడ్డి తనను కంచె వేసి కాపాడుకోవాలని అడుగుతున్నారు. మూడు విడతల రైతుబంధు ఎగ్గొట్టినందుకా, యాసంగి బోనస్ బోగస్ చేసినందుకా, కరెంటు



కోతలతో రైతులను గోస పెడుతున్నందుకా, 7,600 మంది చనిపోయిన రైతులకు బీమా డబ్బులు ఇవ్వనందుకా, ఏ కారణంతో రేవంత్‌ను కాపాడుకోవాలి. గతంలో ఆటో డ్రైవర్‌కు చెబితే ఎరువులు ఇంటికి వచ్చేవి, ఇప్పుడు చెప్పులు లైన్లో పెట్టి యూరియా కోసం ఎదురుచూసే దౌర్భాగ్యం వచ్చింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేయకుండా దేవుడిని, రైతులను మోసం చేసిన పాపానికి రేవంత్‌ను దేవుడు, ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రూపంలో 2023 డిసెంబర్‌లో రాష్ట్రానికి ఓ పెద్ద 'ఎల్‌నినో' పట్టుకుంది. కరువు వస్తుందని ముందే ఊహించి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. గత రెండేళ్లు ఎల్లంపల్లి, మిడ్ మానేరు ద్వారా కాళేశ్వరం మోటార్లతోనే బ్రహ్మాండంగా పంటలు పండాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతో, బురద రాజకీయాల కోసం నీళ్లను వృథా చేస్తోంద హరీశ్ రావు తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎన్నుమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే

# ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు

**పత్రాలను పూరించేందుకు వాలంటీర్లు సహకరించాలి**

**విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల జూలై 01 (వుదయం కరస్పాండెంట్) :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నుమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు కాబడతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం గద్వాల మండలంలోని తుర్కోనిపల్లి గ్రామం, పోలింగ్ స్టేషన్ 272 పరిధిలో బూత్ లెవెల్ అధికారులు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా మొదట నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇండ్లకు వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ఓటర్లు ఎన్నుమరేషన్ పత్రాలను పూరించేందుకు బిఎల్ఎలు, వాలంటీర్లు సహకరించాలని కోరారు. పలువురికి కలెక్టర్ ఎన్నిమరేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనము, రాత, పాఠ్య పుస్తకాల పంపిణీ, తదితర అంశాలపై మాట్లాడారు. పలువురు విద్యార్థులతో బోర్డుపై పాఠ్యాంశాలను రాయించి వారి అభ్యసన సామర్థ్యంను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ పర్యటనలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, సూపర్వైజర్ శ్రీనివాసులు, బిఎల్ఓ లక్ష్మి , జిపిఓ ఆనంద్, బీఎల్ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ తో అక్రమాలను గుర్తించడం సాధ్యమైంది

**6000 యూరియా బస్తాలు మాయమైన కేసులో డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు**

**వ్యవసాయశాఖ అధికారిని కూడా సస్పెండ్ చేశాము**

**అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయి**

**రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం రాజీపడదు**

**ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్, జులై 1 (ఎఎంఎస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ (యూరియా యాప్) ద్వారా ఎరువుల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం సాధ్యమైందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువుల లావాదేవీలన్నీ పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నమోదవుతున్నందున తప్పుడు ఎంట్రీలు, కల్పిత బిల్లులు, అక్రమ నిల్వలు, యూరియా మళ్లింపులను సులభంగా గుర్తించడం సాధ్యమైందని అన్నారు. సిద్దిపేట జిల్లాలో 6000 యూరియా బస్తాలు మాయమైనట్టు యాప్ ద్వారా గుర్తించి, ఇద్దరు హోల్ సేల్ డీలర్లు, ఒక రిటైలర్ లైసెన్స్‌ను వ్యవసాయ శాఖ రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వ్యవసాయశాఖ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం వలన ప్రభుత్వం అక్రమాలపై అనుసరిస్తున్న కఠిన వైఖరికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లాలో, ఒక సొసైటీ పరిధిలో ఎరువుల సరఫరాలో జరిగిన అక్రమాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా యూరియా అక్రమాలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం రాజీపడదని, ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. యూరియా పంపిణీని పూర్తిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారా నిర్వహించడం వల్ల అక్రమదారులకు అన్ని మార్గాలు మూసుకుపోయాయని మంత్రి తెలిపారు. రైతులకు సక్రమంగా అందాల్సిన యూరియాను ఎవరైనా అక్రమంగా పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో యాప్ వ్యవస్థ లేకపోవడం వల్ల అసలైన రైతులకు చేరాల్సిన యూరియాను కొందరు అక్రమంగా ప్రైవేట్ సంస్థలకు విక్రయించి రైతులను మోసం చేసే పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు అలాంటి అవకాశాలకు పూర్తిగా అడ్డుకట్ట పడిందన్నారు. రాష్ట్రంలో 3.64 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా ప్రణాళిక ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 5.62 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించగలిగామని చెప్పారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చి, రాష్ట్రానికి అవసరమైన యూరియాను సకాలంలో అందుబాటులోకి తీసుకురాగలిగామని పేర్కొన్నారు. ఇదంతా రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. యూరియా యాప్‌పై కొందరు అనవసర విమర్శలు చేస్తున్నప్పటికీ, రైతులు రోజురోజుకూ అధిక సంఖ్యలో యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేయడం ఈ యాప్ పై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 52.30 లక్షల బస్తాల యూరియాను రైతులు బుక్ చేసుకోగా, అందులో 46.03 లక్షల బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 79.29 లక్షల బస్తాల యూరియా అందుబాటులో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ ఎరువులను దుర్వినియోగం చేయడానికి లేదా అక్రమాలకు పాల్పడేందుకు ఎవరికీ అవకాశం ఇవ్వబోమని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎరువుల సరఫరా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు.రైతుల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో యూరియా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

# మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

**సాగునీటితో రైతుల శ్రేయస్సుకే ప్రాజెక్టుల నిర్మాణం**

**తనగల గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల జూలై 01 (వుదయం బ్యూరో) :** పంటలు సమృద్ధిగా పండేందుకు సాగునీరు అవసరమని, అందుకే ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయంలో రైతులు సహకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ కోసం వడ్డేపల్లి మండలం తనగల గ్రామస్తులతో జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులు, ప్రాజెక్టులు, తదితర అభివృద్ధి జరిగేందుకు భూసేకరణ తప్పదని ఈ విషయాన్ని రైతులు అర్థం చేసుకుని తమ భూములను ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. మొదట తనగల గ్రామంలోని భవనాలు, చెట్లు, తదితర బౌండరీ సర్వే చేసేందుకు గ్రామస్తులు సహకరించా లన్నారు. ఆర్డీఎస్ పరిధిలోని తుంగభద్ర నది నీటిని అలంపూర్ నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి తుమ్మిళ్ల ఫేజ్ 1 ఎత్తిపోతల పథకంలో భాగంగా మలమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు కావలసిన 567 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినందున ఇప్పటికే గ్రామసభలు నిర్వహించా మన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ విషయంలో తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ తాము వ్యవసాయం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నామని భూములు కోల్పోతే బ్రతుకుతెరువు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు భూములు ఇస్తే తమకు ప్రభుత్వ ఉద్యోగాలు, కోల్పోయిన భూమికి సమానంగా భూములను ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. మరికొందరు రైతులు ప్రస్తుతం ఆ భూమి విలువ ఆధారంగా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మరికొన్ని సమావేశాలు కూడా రైతులతో నిర్వహిస్తామని రైతులెవ్వరు అధైర్య పడకుండా సానుకూలంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, వడ్డేపల్లి తహసిల్దార్ శివకుమార్, తనగల గ్రామ సర్పంచ్ వెంకటేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### అమెరికా సుప్రీం కోర్టు తీర్పు

## చారిత్రాత్మకం

మొదటి పేజీ తరువాయి


అధ్యక్షుడు ఖండేరావ్ కంద్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం 6 నుంచి 7 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఉన్నట్లు తాజా అంచనాలు పేర్కొంటున్నాయి. వారిలో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో హెచ్1బీ వీసాదారులకు ఊరట లభించనుంది.

## సిసి కెమెరాలకు చిక్కకుండా.. ఇంటి దొంగల మాస్టర్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి

ఆ డబ్బును బయటకు తరలించినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులతో తమకున్న సాన్నిహిత్యం కారణంగా.. తమను ఎవరూ అనుమానించలేకపోయారని అవినాష్ శుక్లా విచారణలో వెల్లడించాడు. చోరీ చేసిన సొమ్ముతో తాను ఇల్లు, స్థలం కొనుగోలు చేసినట్లు శుక్లా విచారణలో అంగీకరించాడు. దీంతో అతడి ఆర్థిక లావాదేవీలతో పాటు, ఇతర నిందితుల ఆస్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఎవరికీ అనుమానం రాకుండా నిందితులు సుదీర్ఘకాలంగా ఎలా ఈ చోరీ చేశారు? వీరి వెనుక ఇంకెంతమంది ఉన్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక, విచారణ సమయంలో నిందితులు పలుమార్లు ట్రస్టీ అనిల్ మిశ్రా పేరును ప్రస్తావించినట్లు సమాచారం. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత ఆయన సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

# ఆపరేషన్ ముస్కాన్'ను విజయవంతం చేయండి



**జిల్లాలో ఒక్క బాల కార్మికుడూ ఉండొద్దు**

**ప్రతి చిన్నారి బడిలోనే ఉండాలి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్ అధ్యక్షతన సమన్వయ సమావేశం**

**నాగర్ కర్నూల్, జూలై 01 (వుదయం బ్యూరో):** జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి ప్రతి చిన్నారికి విద్యా హక్కు కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రమాకాంత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కోర్టు భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన 12వ 'ఆపరేషన్ ముస్కాన్–2026' సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీదేవి, కార్మిక, విద్య, మహిళా శిశు సంక్షేమ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

**నేటి నుంచి జులై 31 వరకు 'ఆపరేషన్ ముస్కాన్'**

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రమాకాంత్ మాట్లాడుతూ, నేటి నుంచి జులై 31వ తేదీ వరకు నిర్వహించే 12వ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలిక తప్పనిసరిగా బడిలోనే ఉండేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఆర్థిక, కుటుంబ లేదా ఇతర కారణాల వల్ల పిల్లలు చదువుకు దూరమై పనుల్లో చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యకు దూరమైన ప్రతి చిన్నారిని గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సంబంధిత శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు.

**బాల కార్మికులను పెట్టుకుంటే కఠిన చర్యలు**

జిల్లాలోని హోటళ్లు, టీ దుకాణాలు, గ్యారేజీలు, పరిశ్రమలు, నిర్మాణ పనులు, ఇటుక బట్టీలు, వ్యవసాయ క్షేత్రాల్లో బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వారిని వెంటనే రక్షించాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు : కలెక్టర్**

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, జిల్లాలో బాల కార్మిక నిర్మూలనకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, కార్మిక, మహిళా శిశు సంక్షేమ, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. బడికి వెళ్లకుండా పనుల్లో ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ప్రజలు ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

**బాలల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : ఎస్పీ**


జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యతల్లో ఒకటని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి రక్షిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, కార్మికశాఖ అధికారి, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారిని దమయంతి, వైద్యారోగ్య శాఖల అధికారులు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి శ్రీశైలం, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.



" అమెరికాకు భారత్ విశ్వసనీయ మిత్రదేశం. ఇరుదేశాల మధ్య ఉన్న మధ్య సంబంధాలు రెండు దేశాలకే కాకుండా ప్రపంచదేశాలకు కూడా ఉపయోగకరం. భారత్–చైనాల విషయంలో భద్రతా వ్యత్యాసాన్ని వివరిస్తూ.. తాను చైనా కు వెళ్లినప్పుడు ఫోన్‌ను తీసుకువెళ్లనని.. ఇంట్లోనే పెట్టి వెళ్తా.. కానీ భారత పర్యటనకు వెళ్తే మాత్రం ఫోన్ తీసుకువెళ్తాను. ఢిల్లీ విషయంలో ఉన్న నమ్మకం బీజింగ్ విషయంలో ఉంది. బీజింగ్‌తో వాషింగ్టన్ పూర్తిగా సంబంధాలు తెంచుకోబోదు. నష్ట భయాలను తగ్గించుకుంటూ ఆ దేశంతో సంబంధాలు కొనసాగిస్తాం. అమెరికా, భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనుంది.

\- అమెరికా సెనెటర్ స్టీవ్ డైన్స్ "

## వే'మన'పద్యం



నేరనన్నవాడు నెరజాణ మహిలోన
నేర్తునన్నవాడు నిందజెందు
ఊరకున్నవాడె యుత్తమయోగిరా
విశ్వదాభిరామ! వినురవేమ

# పరీక్షలపై నమ్మక మేది..?

ఈ పరిస్థితుల ప్రభావం కేవలం పరీక్షల వరకే పరిమితం కావడం లేదు. విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశ పెరుగుతున్నాయి. పేపర్ లీకేజీల నేపథ్యంలో ఇప్పటివరకు 11 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరం. దీనికి కేంద్ర ప్రభుత్వమే NTA (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వైఫల్యమే ప్రధాన కారణం. నేడు దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ విద్యార్థుల్లో నమ్మకం కలిగించే స్థాయిలో ప్రభుత్వం స్పందించలేదు, ప్రభుత్వంలో జవాబుదారుతనం లోపించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని భరోసా కల్పించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వ పాలకులు ఉన్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది.



ఒక దేశ అభివృద్ధి ఆ దేశ విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించే సాధనం మాత్రమే కాదు; శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దేది విద్య . అందుకే ప్రతి దేశం విద్యను అత్యంత ప్రాధాన్య రంగంగా పరిగణిస్తుంది. కానీ నేడు మన దేశంలో విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆందోళనకు ప్రధాన కారణం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న లోపాలే. నీట్ వంటి పరీక్షల్లో పేపర్ లీకేజీ విద్యా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బ తీశాయి. సుమారు 22 లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి చదివి, కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్న వారు ఉన్నారు అయితే ఒక పేపర్ లీకేజీతో వారి శ్రమ, వారి కలలు, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ఈ పరిస్థితుల ప్రభావం కేవలం పరీక్షల వరకే పరిమితం కావడం లేదు. విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశ పెరుగుతున్నాయి. పేపర్ లీకేజీల నేపథ్యంలో ఇప్పటివరకు 11 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరం. దీనికి కేంద్ర ప్రభుత్వమే NTA (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వైఫల్యమే ప్రధాన కారణం. నేడు దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆందోళనలు నిర్వహిస్తున్నారు , ఇప్పటికీ విద్యార్థుల్లో నమ్మకం కలిగించే స్థాయిలో ప్రభుత్వం స్పందించలేదు, ప్రభుత్వంలో జవాబుదారుతనం లోపించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని భరోసా కల్పించలేని నిస్సాయ స్థితిలో ప్రభుత్వ పాలకులు ఉన్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది. మరోవైపు, డిజిటల్ ఇండియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతికత గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం, ఒక జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించలేకపోవడం పాలకుల డొల్లతనం కనబడుతుంది జాతీయ పరీక్షల సంస్థ (NTA)పై వరుసగా వస్తున్న ఆరోపణలు పరీక్షల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. గతంలో కూడా నీట్, నెట్ వంటి పరీక్షల లీకేజీలు జరిగిన పరీక్షల నిర్వాహన వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక భద్రతను నిర్ధారించాలి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తిరిగి నమ్మకం కల్పించాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది. అదే సమయంలో విద్యారంగానికి సంబంధించిన విధానాలపైనా తీవ్రమైన చర్చ అవసరం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను క్రమంగా తన నియంత్రణలోకి తీసుకుంది. నూతన జాతీయ విద్యా విధానం శాస్త్రీయ దృక్పథాన్ని, హేతుబద్ధ ఆలోచనను పెంపొందించకుండా, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల తయారీకి మాత్రమే పరిమితమవుతోందనే ఆందోళన విద్యావేత్తల్లో వ్యక్తమవుతోంది. విద్య అనేది కేవలం కంపెనీలకు ఉద్యోగులను తయారు చేసే ప్రక్రియ కాదు; , ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే చైతన్యవంతమైన పౌరులను తయారు చేసే వ్యవస్థ. భారత విద్యా చరిత్ర కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు విద్యను సమానత్వానికి, సామాజిక న్యాయానికి, విముక్తికి సాధనంగా భావించారు. వారి దృష్టిలో విద్య అంటే కేవలం డిగ్రీ కాదు; శాస్త్రీయ ఆలోచన, హేతుబద్ధ దృక్పథం, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించే ప్రక్రియ. అందువల్ల జాతీయ పరీక్షల వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలి. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పారదర్శకమైన, నమ్మకమైన విద్యను అందించాలి. ఒక దేశ అభివృద్ధిని నిర్మించేది అద్దాల మేడలు రంగుల గోడలు కాదు; పౌరుల నైతిక అభివృద్ధి నిజమైన దేశాభివృద్ధి ఆ నైతిక అభివృద్ధిని తీర్చిదిద్దేది విద్య. అలాంటి విద్యనే నిర్లక్ష్యం, వ్యాపారం అవినీతిమయం, పేపర్ లీకేజీలతో బలహీనపరిస్తే నష్టపోయేది ఒక్క విద్యార్థి కాదు.. దేశ భవిష్యత్తే.



డా ఆర్ ఎల్ మూర్తి
8247672658

## శ్రమ నేస్తం

నన్ను చూసి అలసట అనుకోవద్దు
నేనే కదా నీ గెలుపుకు సంకేతం !
నా వాసన చూసి దూరం పోకు..
నేను బయట పడందే లక్ష్యం చేరలేవు !
కింద పడిన నా ప్రతి బిందువులు..
రేపటి పుష్కల పంటకు పెట్టుబడులు !
నన్ను నమ్మినోడు శిఖరాగ్రం చేరతాడు..
నన్ను లోననే దాచినోడు ఓడిన సోమరి !
నన్ను చిందిస్తే కన్నీళ్లకు అడ్డుకట్టలు..
నన్ను దాచేస్తే వైఫల్య కన్నీటి వరదలు !
నీలోని నిద్ర మబ్బును తరుముతాను..
నేను నీ చురుకుదనాన్ని పెంచే తైలాన్ని !
నీతో దేహాన్ని తడిపినోన్ని అందలం
ఎక్కిస్తాను..
నన్ను నిర్లక్ష్యం చేసినోడి
అంతం చూస్తాను !
నేనే రాస్తాను అద్భుత ప్రపంచ చరిత్ర..
సమానత్వానికి నేనే కదా
అపూర్వ చిహ్నం !
నీటి బిందువు కదా అని
చులకన చేయకు..
నీ గెలుపోటముల్ని నిర్ణయించే
శ్రమ స్వేదాన్ని !
క్రియాశీలతను పెంచే
శ్రామికుల నేస్తమై..
చుక్కల్లో చంద్రుడిలా
జీవితాన్ని వెలిగిస్తాను !
కొవ్వత్తిలో కరిగి
వెలుగులు చిమ్మే కొవ్వును..
నేను లేని జీవన
ప్రయాణం చీకటి మయం !
నేనే కదా విజయతీరాలకు
చేర్చే ఇంధనం..
నేను నేలపై రాలితేనే
నీవు పైపైకి చేరతావు !
ఇంతకు నేనెవరో
నీకు తెలిసే ఉంటుంది..
నీ విలువను పెంచే
"చెమట చుక్కను" నేనే !

మధుపాళీ
9949700037

## ఆన్‌లైన్ ఔషధాలు
# ప్రజారోగ్యానికి పెను ముప్పు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషి అవసరాలను సులభతరం చేస్తూ సమస్తాన్ని ఇంటి ముంగిటకే తెచ్చిపెడుతోంది కానీ, ప్రాణాలతో ముడిపడి ఉన్న ఔషధాల విషయంలో మాత్రం ఈ విధానం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కేవలం లాభాలే పరమావధిగా సాగుతున్న ఈ – ఫార్మసీల ధాటికి ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారుతోంది. సాధారణ వస్తువుల విక్రయానికి, ప్రాణరక్షక ఔషధాల విక్రయానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విస్మరించి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తలుపులు బార్లా తెరవడం విచారకరం. ప్రిస్క్రిప్షన్ల వెరిఫికేషన్ లేకుండానే మందులు సరఫరా అవుతుండటంతో నకిలీ మందులు రోగి చెంతకు చేరే ప్రమాదం పొంచి ఉండటమే కాకుండా, యువత నిద్ర మాత్రలు, ఇతర మత్తు పదార్థాలకు సులభంగా బానిసయ్యే అవకాశం ఉంది. ఇది యువశక్తిని నిర్వీర్యం చేస్తూ జాతి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుంది. మరోవైపు, భారీ డిస్కౌంట్ల పేరుతో బహుళజాతి కంపెనీలు సాగిస్తున్న ఈ వ్యాపార పోకడల వల్ల దేశవ్యాప్తంగా ఉన్న 12.40 లక్షలకు పైగా చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. చదువురాని పేద రోగులకు ఆన్‌లైన్ ఆర్డర్లు ఒక భారంగా మారుతుంటే, స్థానిక కెమిస్టులు అందించే కౌన్సెలింగ్ , భద్రత ఈ విధానంలో మృగ్యమవుతున్నాయి. ఈ ప్రమాదకర ధోరణులను నిరసిస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ (AIOCD) పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్ జరుగుతోంది. కేవలం వ్యాపార లాభాల కోసమే కాకుండా, ప్రిస్క్రిప్షన్ వెరిఫికేషన్ చూడకుండా మందులు అమ్మే ఆన్‌లైన్ పద్ధతి వల్ల ప్రజల ప్రాణాలు బలికాకూడదన్నదే ఈ నిరసన వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం. ఇప్పటికే అనేక చోట్ల ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా నాణ్యత లేని మందులు సరఫరా అవుతున్న సంఘటనలు వెలుగుచూస్తుండగా, ప్రభుత్వం ఈ – ఫార్మసీ విధానాన్ని ప్రోత్సహించడం ప్రజా శ్రేయస్సుకు గొడ్డలిపెట్టుగా మారింది. అత్యవసర మందుల అవసరం ఉన్న రోగులు మే 20వ తేదీన మెడికల్ షాపులు మూసివేసి ఉంటాయి కాబట్టి, ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కెమిస్టుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ – ఫార్మసీ విధానాన్ని నియంత్రించాలని, ఔషధ రంగంలో బహుళజాతి సంస్థల పెత్తనాన్ని నిలువరించి, విద్య, వైద్యం లాభాపేక్ష లేని సేవలుగానే కొనసాగేలా చూడాలని మనమూ ఆశిద్దాం.



యండి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ జర్నలిస్ట్

## మాటల చెట్టు నీడలో

ఒకప్పుడు ప్రశ్నలు పూసాయి
ఇప్పుడు లేబుళ్ళ గాలికి
ఆ పూలు రాలిపోతున్నాయి .

వాదనల నదిలో
నిజాలు ఈదేవి ఒకప్పుడు
ఇప్పుడు నినాదాల వరదలో
ఒడ్డునే చిక్కుకుపోతున్నాయి

ప్రశ్న అడిగిన పెదవికి
పేరు పెడుతున్నారు
సమాధానం చెప్పాల్సిన వారు
మౌనాన్ని అమ్ముతున్నారు

అద్దంలా ఉండాల్సిన చర్చ
పొగమంచు లా మారి
ముఖాలనే మింగేస్తోంది

విత్తనం లా పడిన సందేహం
జ్ఞానవృక్షమై ఎదగక ముందే
తొక్కబడుతోంది

ఒక పక్షి పాటను వినకముందే
దాని రంగు చూసి
తీర్పు చెప్తున్న కాలమిది

చెవులు మూసుకున్న వీధుల్లో
ప్రతిధ్వనులే
ప్రజాభిప్రాయాలై తిరుగుతున్నాయి

మాటకు మాట కలిసే
వంతెనలు కూలిపోతే
మనుషుల మధ్య దూరాలు
గోడలవుతాయి

అందుకే ,
ఒక ప్రశ్న ను
కాపాడాలి
ఒక అసమ్మతి ని గౌర
వించాలి .



మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
సెల్ : 98850 45344

## వీడియో కాల్

నువ్వు పుట్టినప్పుడు
ఫోన్లో ఫోటో చూశాను.
అప్పుడప్పుడు
వీడియో కాల్ లో
హాయ్ అంటుంటాను.
ఒక్కోసారి
స్క్రీన్ కి ముద్దులు కూడా
పెడుతుంటాను
నా ప్రేమ ముద్దులు
గ్లాస్ కి తగిలి పగిలిపో
తుంది కానీ,
నేను పోయినా
నా పేరు నిన్ను చేరుతుంది
అది చాలు
నా బ్రతుక్కి

ఏటూరి నాగేంద్రరావు
7416665323

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## అసలైన ప్రేమ

ప్రేమించిన వారిని ప్రేమించడం..
ఓ అనివార్య ప్రతిస్పందన
మంచితనం వల్ల ప్రేమించడం..
ఓ ప్రస్తుతించే అభిమానం
అందాన్ని చూసి ప్రేమించడం..
ఓ తాత్కాలిక ఆకర్షణ
ధనాన్ని చూసి ప్రేమించడం..
ఓ దురాశల దురద
ఎందుకు ప్రేమించామో..
తెలియక పోవడమే..
అసలైన ప్రేమ అవుతుంది తెలుసా !

మధుపాళీ
9949700037

# అక్షయ పోషక భాండాగారం.. గ్రామీణ ఆర్థిక చైతన్యం!

*ప్రపంచ వ్యాప్తంగా పాల రంగాన్ని పరిశీలిస్తే, భారతదేశానిది ఒక అద్వితీయమైన, గర్వించదగిన విజయగాథ. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో మన దేశం తీవ్రమైన పాల కొరతను ఎదుర్కొనేది. విదేశాల నుంచి పాలపొడిని దిగుమతి చేసుకుంటే తప్ప దేశ అవసరాలు తీరని దయనీయ స్థితి అది. కానీ, ఆ చీకట్లను చీల్చుకుంటూ 1970వ సంవత్సరంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (NDDB) ఆధ్వర్యంలో ప్రారంభమైన 'ఆపరేషన్ ఫ్లడ్' దేశ చరిత్రను మలుపు తిప్పింది. దీనినే మనం గౌరవంగా 'భారత శ్వేత విప్లవం' అని పిలుచుకుంటాం. ఈ మహత్తర ఉద్యమానికి ప్రాణం పోసి, దిశానిర్దేశం చేసిన మహానుభావుడు, 'భారత శ్వేత విప్లవ పితామహుడు' డాక్టర్ వర్గీస్ కురియన్. గుజరాత్‌లోని ఆనంద్ వేదికగా ఆయన సృష్టించిన 'అమూల్' సహకార నమూనా దేశవ్యాప్తంగా విస్తరించింది.*

మానవ పరిణామ క్రమంలో, నాగరికత విస్తరణలో పశుపోషణ, పాల వినియోగం అత్యంత కీలకమైన మైలురాళ్లు. మనిషి జననం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలోనూ అండగా నిలిచే ఏకైక సంపూర్ణ సహజ ఆహారం పాలు. కేవలం శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ద్రవపదార్థం గానే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది గ్రామీణ రైతుల జీవన చక్రానికి ఇంధనంగా, ఆర్థిక భద్రతకు తిరుగులేని ఆసరాగా నిలుస్తోంది. అంతటి ప్రాధాన్యమున్న పాల రంగ విశిష్టతను, మానవాళికి అది చేస్తున్న మేలును, అంతరంలో దాగున్న ఆర్థిక సామాజిక సమీకరణాలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీని 'ప్రపంచ పాల దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం కేవలం ఒక సంప్రదాయ వేడుక కాదు; గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోస్తున్న శ్రమజీవులైన పాడిరైతుల చెమట చుక్కకు అంతర్జాతీయ సమాజం ఇస్తున్న మహోన్నత గౌరవం. ఈ అంతర్జాతీయ దినోత్సవ ఆవిర్భావం వెనుక ఒక బలమైన సామాజిక, పోషకాహార లక్ష్యం ఉంది. గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ లేదా ప్రపంచ ఆహార భద్రతలో పాల పాత్రను గుర్తించిన ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'ఆహార, వ్యవసాయ సంస్థ' (FAO) 2001వ సంవత్సరంలో ఈ ప్రపంచ పాల దినోత్సవానికి నాంది పలికింది. ప్రపంచం లోని అనేక దేశాలు తమ స్థానిక వాతావరణం, సాంప్రదాయాలను బట్టి అప్పటికే వివిధ తేదీల్లో పాల దినోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో, వాటన్నింటినీ ఒకే తాటిపైకి తెస్తూ జూన్ 1ని అంతర్జాతీయ ప్రామాణిక తేదీగా ఎఫ్ఏఓ ప్రకటించింది. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా ఒక ప్రత్యేకమైన సుస్థిర లక్ష్యంతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కాలంలో పర్యావరణ పరిరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, సుస్థిర పద్ధతుల్లో అధిక దిగుబడి సాధించడం, నాణ్యమైన పోషకాలను అందించడం వంటి సమకాలీన అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు విరివిగా జరుగుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో మానవుడు ఎంతటి ప్రగతి సాధించినప్పటికీ, పాలకు ప్రత్యామ్నాయమైన సంపూర్ణ కృత్రిమ ఆహారాన్ని సృష్టించలేకపోయాడు. ప్రకృతి మానవాళికి ప్రసాదించిన అమృతంగా పాలను శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు అభివర్ణిస్తారు. మానవ శరీర నిర్మాణానికి, కణజాలాల మరమ్మతులకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల ప్రోటీన్లు పాలలో సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఎముకలు, దంతాల పటిష్టతకు కావలసిన కాల్షియం, ఫాస్ఫరస్ పాలలో లభించినంత సులభంగా మరే ఇతర ఆహారంలోనూ లభించవు. శరీరానికి తక్షణ శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు (లాక్టోజ్), ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు కంటి చూపును మెరుగుపరిచే విటమిన్–ఎ, కణాల జీవక్రియలను నియంత్రించే రిబోఫ్లావిన్, నాడుల వ్యవస్థను చురుగ్గా ఉంచే విటమిన్–బి12, గుండె ఆరోగ్యాన్ని రక్షించే పొటాషియం వంటి ఖనిజ లవణాలు పాలలో మెండుగా ఉన్నాయి. పెరుగుతున్న బాలల శారీరక, మానసిక వికాసానికి, గర్భిణీ స్త్రీల గర్భస్థ శిశువు ఎదుగుదలకు, వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల బలహీనత వ్యాధులను నివారించడానికి రోజువారీ ఆహారంలో పాలు కచ్చితంగా భాగం కావాలని వైద్య లోకం ముక్తకంఠంతో సిఫార్సు చేస్తోంది. ఈ పోషక విలువల వెనుక సమాంతరంగా నడుస్తున్న మరో అద్భుత దృశ్యం ప్రపంచవ్యాప్త గ్రామీణ ఆర్థిక వికాసం. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ప్రారంభమైన పాడి పరిశ్రమ నేడు స్వతంత్రంగా కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న అతిపెద్ద వ్యవస్థగా రూపాంతరం చెందింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు ఒక బిలియన్ (వంద కోట్ల) మంది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాడి రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంలో పంట చేతికి రావడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వస్తే, పాడి పరిశ్రమ మాత్రం రైతుకు ప్రతిరోజూ నగదు చేకూర్చే అక్షయపాత్రగా నిలుస్తోంది. వాతావరణ మార్పులు, అనావృష్టి లేదా అతివృష్టి కారణంగా పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విపత్కర పరిస్థితుల్లో సైతం, పశువుల ద్వారా వచ్చే రోజువారీ ఆదాయమే వారి కుటుంబాలను ఆకలి నుంచి, ఆత్మహత్యల నుంచి కాపాడుతోంది. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం మరింత విప్లవాత్మకమైనది. భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పోషణ, పాల సేకరణ, సహకార సంఘాల నిర్వహణలో మహిళలే అగ్రభాగాన నిలుస్తున్నారు. ఇది వారి చేతుల్లోకి ఆర్థిక వనరులను చేర్చి, కుటుంబ నిర్ణయాల్లో వారి ప్రాధాన్యతను పెంచి, సామాజికంగా మహిళా సాధికారతకు బలమైన పునాది వేసింది.

ప్రపంచ వ్యాప్తంగా పాల రంగాన్ని పరిశీలిస్తే, భారతదేశానిది ఒక అద్వితీయమైన, గర్వించదగిన విజయగాథ. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో మన దేశం తీవ్రమైన పాల కొరతను ఎదుర్కొనేది. విదేశాల నుంచి పాల పొడిని దిగుమతి చేసుకుంటే తప్ప దేశ అవసరాలు తీరని దయనీయ స్థితి అది. కానీ, ఆ చీకట్లను చీల్చుకుంటూ 1970వ సంవత్సరంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (NDDB) ఆధ్వర్యంలో ప్రారంభమైన 'ఆపరేషన్ ఫ్లడ్' దేశ చరిత్రను మలుపు తిప్పింది. దీనినే మనం గౌరవంగా 'భారత శ్వేత విప్లవం' అని పిలుచుకుంటాం. ఈ మహత్తర ఉద్యమానికి ప్రాణం పోసి, దిశానిర్దేశం చేసిన మహానుభావుడు, 'భారత శ్వేత విప్లవ పితామహుడు' డాక్టర్ వర్గీస్ కురియన్. గుజరాత్‌లోని ఆనంద్ వేదికగా ఆయన సృష్టించిన 'అమూల్' సహకార నమూనా దేశవ్యాప్తంగా విస్తరించింది. దళారీల దోపిడీని అరికడుతూ గ్రామ గ్రామాన పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయడం, ఆధునిక శీతలీకరణ కేంద్రాలను నెలకొల్పడం, శాస్త్రీయ మార్కెటింగ్ విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా పల్లెల్లో పాల వెల్లువ కురిసింది. ఫలితంగా, దిగుమతులపై ఆధారపడిన భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యధికంగా పాలను ఉత్పత్తి చేసే అగ్రగామి దేశంగా అవతరించింది.

ప్రస్తుత గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న మొత్తం పాలలో భారతదేశం వాటా దాదాపు 24 నుంచి 25 శాతానికి పైగా ఉంది. దేశంలో వార్షిక పాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 24 కోట్ల టన్నుల మైలురాయిని దాటి దూసుకుపోతోంది. అంతకంటే ముఖ్యంగా, గతంలో పడిపోయిన తలసరి పాల లభ్యత నేడు గణనీయంగా వృద్ధి చెంది, రోజుకు సగటున 450 గ్రాములకు పైగా నమోదవుతోంది. ఇది అంతర్జాతీయ సగటు (సుమారు 300 గ్రాములు) కంటే చాలా ఎక్కువ కావడం విశేషం. దేశీయంగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పాల ఉత్పత్తిలో అగ్రశ్రేణిలో ఉంటూ దేశ వృద్ధికి తోడ్పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పాడి పరిశ్రమ గ్రామీణ జీవన విధానంతో పెనవేసుకు పోయింది. విజయ, సంగం, విశాఖ, అమూల్ వంటి సహకార డెయిరీలతో పాటు ప్రైవేటు రంగానికి చెందిన ప్రముఖ డెయిరీలు గ్రామీణ ప్రాంతాల్లో పటిష్టమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయి. లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులకు నిరంతర ఆదాయ వనరుగా ఉంటూ, గ్రామీణ నిరుద్యోగాన్ని తగ్గించడంలో ఈ రంగం రక్షణాత్మక కవచంగా పనిచేస్తోంది. కేవలం పచ్చి పాలు అమ్మడమే కాకుండా, విలువల జోడింపు ద్వారా పాల ఆధారిత అనుబంధ పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఊహించని రీతిలో ఊతాన్నిస్తున్నాయి. మారుతున్న ఆధునిక జీవనశైలికి అనుగుణంగా పెరుగు, వెన్న, నెయ్యి, పనీర్, చీజ్, ఫ్లేవర్డ్ మిల్క్, ఐస్‌క్రీమ్‌లు, వివిధ రకాల పాల మిఠాయిలు, శిశువుల కొరకు తయారుచేసే ప్రత్యేక పాలపొడి ఉత్పత్తుల మార్కెట్ ఏటా వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో విస్తరిస్తోంది. పట్టణీకరణ పెరిగే కొద్దీ ఈ ఉత్పత్తులకు డిమాండ్ మరింత పెరుగుతోంది. దీనివల్ల రవాణా, ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్ చైన్, రిటైల్ రంగాలలో లక్షలాది మంది పట్టణ, గ్రామీణ యువతకు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలన్నింటిలోనూ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏకైక విభాగంగా పాడి పరిశ్రమ నిలవడం దానికున్న పారిశ్రామిక ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. అయితే, ఇంతటి ఉజ్వలమైన ప్రగతి పథంలో పయనిస్తున్న పాల రంగం అంతర్గతంగాను, బహిర్గతంగాను కొన్ని తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రస్తుత రోజుల్లో పాడి రైతులకు పశువుల మేత కొరత ఒక పెద్ద సమస్యగా మారింది. అడవులు, పచ్చిక బయళ్లు తగ్గిపోవడం, వాణిజ్య పంటల సాగు పెరగడం వల్ల పశుగ్రాసం కొరత ఏర్పడి, పశుదాణా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల తీవ్రత కారణంగా పశువుల పాలు ఇచ్చే సామర్థ్యం క్షీణిస్తోంది. లంపీ స్కిన్ వంటి అంటువ్యాధులు పశుసంపదను కబళిస్తూ రైతులకు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఉత్పత్తి వ్యయం నిరంతరం పెరుగుతున్నా, దానికి తగినట్లుగా మార్కెట్‌లో పాలకు లాభసాటి ధర లభించక పోవడం సగటు రైతును నిరుత్సాహపరుస్తోంది. మరోవైపు, వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న 'పాల కల్తీ' సమస్య అత్యంత ఆందోళనకరంగా మారింది. ఎక్కువ లాభాల కోసం కొందరు స్వార్థపరులు పాలలో యూరియా, డిటర్జెంట్లు, సింథటిక్ రసాయనాలు, స్టార్చ్, ఆయిల్స్ వంటి ప్రమాదకర పదార్థాలను కలిపి కృత్రిమ పాలను సృష్టిస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి, ముఖ్యంగా పాలు నమ్ముకున్న పసిపిల్లల భవిష్యత్తుకు తీవ్ర హాని కలిగిస్తోంది. ఈ సవాళ్లను అధిగమించి, పాల రంగాన్ని సుస్థిర పంథాలో నడపడానికి సరికొత్త సాంకేతిక, శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం అత్యవసరంగా మారింది. పశువులలో జన్యుపరమైన మార్పులు, కృత్రిమ గర్భధారణ పద్ధతుల ద్వారా నాణ్యమైన దేశీ రకాలను అభివృద్ధి చేయడం, పాలు పితికే యంత్రాలను అందుబాటులోకి తేవడం, నాణ్యతా పరీక్షలను డిజిటలైజ్ చేయడం వంటి సంస్కరణలు వేగవంతం కావాలి. కల్తీలను అరికట్టడానికి కఠినమైన చట్టాలను అమలు చేయడంతో పాటు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. అదే సమయంలో, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ తక్కువ నీటి వినియోగంతో, పశువుల వ్యర్థాల (పేడ, మూత్రం) ద్వారా బయో–గ్యాస్, సేంద్రీయ ఎరువులను తయారుచేస్తూ 'గ్రీన్ డెయిరీ' విధానాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలపై ఉంది. ప్రపంచ పాల దినోత్సవం అనేది కేవలం పాలకు సంబంధించిన వార్షిక ప్రచారం కాదు; అది మానవ మనుగడకు, పల్లె సీమల ఆర్థిక పురోగతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధానికి ప్రతీక. తెల్లవారుజామునే లేచి, ప్రకృతితో మమేకమై, పశువుల ఆకలి తీర్చి, పాలను పితికి మన గడప ముందుకు చేర్చే ప్రతి పాడిరైతు శ్రమకు మనం ఇచ్చే నిజమైన నివాళి పాల ప్రాధాన్యతను గుర్తించడమే. సురక్షితమైన, కల్తీ లేని, నాణ్యమైన పాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చినప్పుడే దేశంలో పోషకాహార లోపం అంతరించి ఆరోగ్యవంతమైన నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.





సంగనబట్ల
9440595494

# జాతీయం-అంతర్జాతీయం



## అయోధ్య విరాళాల చోరీ

- కుంభమేళా సమయంలోనే భారీగా మిస్సింగ్

**అయోధ్య:**

అయోధ్య విరాళాల చోరీ కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. గతేడాది ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళా సమయంలోనే రామ మందిరంలో అధిక మొత్తంలో చోరీ జరిగినట్లు తెలిపారు. కుంభమేళాకు వచ్చిన కోట్లాది మంది భక్తులు అయోధ్య రామ మందిరాన్ని కూడా సందర్శించారని, ఆ సమయంలో ఆలయానికి భారీ మొత్తంలో కానుకలు, విరాళాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇదే అదునుగా భావించిన నిందితులు కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయం చేశారన్నారు.

ఈ కేసు లో ఇప్పటి వరకు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. వారిలో లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అనే బావమరుదులు అత్యధిక మొత్తంలో నగదు దొంగిలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు పరిశీలించడానికి ఆదాయపు పన్ను శాఖ, ఈడీ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కుట్రలో కొంతమంది ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు బ్యాంక్ సిబ్బందితో కుమ్మక్కై డబ్బును అక్రమంగా తరలించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## బస్సులో చెలరేగిన మంటలు 8 మంది దుర్మరణం



**రాజస్థాన్**

రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఢిల్లీ ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ధనవాడ సమీపంలో బుధవారం ఉదయం ఇందౌర్‌కు చెందిన స్లీపర్ బస్సు.. ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. మరో 29 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బస్సు రిషికేష్ నుంచి ఇండౌర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నడా..? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నామన్నారు. ఐదుగురు ప్రయాణికులు మంటల్లోనే సజీవ దహనం అయ్యారని.. మరో ముగ్గురు తీవ్రగాయాలై మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఒక రోగికి ఒకేసారి ఐదు అవయవాలను మార్చారు



**హైదరాబాద్:**

ఉస్మానియా వైద్యులు మరో ఘనత సాధించారు. ఒక రోగికి ఒకేసారి ఐదు అవయవాలను మార్చి కొత్త రికార్డు సృష్టించారు. సిరిసిల్లకు చెందిన యువ ఇంజినీర్‌కు పొట్టకు సంబంధించి.. విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తి చేశారు. అతి క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను.. 36 గంటల పాటు కొనసాగించారు. దీంతో ఉస్మానియా వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. దేశంలోనే తొలి సారి ఈ తరహా శస్త్రచికిత్స చేసినట్టు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది.

## 37 కేజీల బంగారంతో పట్టుబడ్డ వ్యక్తి

**గువాహటి:**

అంతర్జాతీయంగా బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అనుమానిస్తున్న ఒక ముఠాను గువాహటి పోలీసులు ఛేదించారు. దాదాపు రూ.54 కోట్లు విలువ చేసే 37 కేజీల బంగారంతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇంత పెద్దమొత్తంలో అక్రమ బంగారాన్ని పట్టుకోవడం ఇదే మొదటిసారి అని మంగళవారం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ నగరాల నుంచి మధ్య ఆసియా, మయన్మార్‌లకు ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు కొనసాగుతున్నట్లు వెల్లడైందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 29, 30 తేదీల్లో



నగరంలోని ఖార్ఘుల్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో ఈ బంగారాన్ని స్వాధీనపర్చుకున్నామని, మహారాష్ట్ర సాంగ్లీకి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశామని పోలీసులు ప్రకటనలో వివరించారు. ఈ దాడిలో మరో 13 గ్రాముల వెండి తునకలు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.3,755 నగదుతో పాటు రవాణాకు ఉపయోగించిన సంచులను స్వాధీనం చేసుకున్నారు.

## తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల:**

తిరుపతి దేవస్థానం ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ. కోటి విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ & ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందజేసింది. తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడిని కలిసిన సంస్థ ప్రతినిధులు తరుణ్, రమేష్ విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా పేద ప్రజల ప్రా



ణరక్షణ కోసం సహకారం అందించిన అపర్ణ సంస్థ యాజమాన్యాన్ని బీఆర్ నాయుడు అభినందించారు.

## విజయ్ సర్కార్‌ను కూల్చేందుకు కుట్ర

- ముగ్గురి అరెస్ట్

**తమిళనాడు:**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీవీకే అధినేత విజయ్ సారథ్యంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు పన్నిన కుట్రను భగ్నం చేసినట్లు తమిళనాడు నిఘా విభాగం వెల్లడించింది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 15మంది టీవీకే ఎమ్మెల్యేలతో ఒకేసారి రాజీనామా చేయించేలా డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ పథకం రచించారని పేర్కొంది. ఈ వ్యవహారంలో సెంథిల్ బాలాజీ సోదరుడు వి. అశోక్ కుమార్ సహా మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముగ్గురు వ్యక్తులు కుట్ర పన్నారని టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇలయ రాజా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టీవీకే నేత తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ అయిన జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని ఇండియన్ పొలిటికల్ డెమోక్రటిక్ స్ట్రాటజీస్ కన్సల్టెన్సీకి చెందిన తిరునావుక్కరసు అనే వ్యక్తి తనను కోరారని ఎమ్మెల్యే ఫిర్యాదులో వెల్లడించారు. ఇందుకుగానూ రూ.35 కోట్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. ఆ




ఆఫర్‌ను తాను తిరస్కరించానని.. ఇకపై తనను సంప్రదించవద్దని అతడికి చెప్పినట్లు తెలిపారు.అయితే, తమ మధ్య జరిగిన సంభాషణను బయటపెడతానని తిరునావుక్కరసు బెదిరించాడని.. దీంతో పోలీసులను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిఘా అధికారుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. డీఎంకే నేత సెంథిల్ బాలాజీ సూచన మేరకే తిరునావుక్కరసు.. ఎమ్మెల్యే ఇళయరాజాను సంప్రదించారని పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## భారత్‌కు పొరుగున కరకు దేశాలు!

**వాషింగ్టన్:**

ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన భౌగోళిక ప్రాంతంలో భారతదేశం ఉందని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ''ఆ దేశానికి ఇరుగుపొరుగున కొన్ని కరకు దేశాలున్నాయి. వాటిలో ఏదైనా దేశం ఆగ్రహంతో నిద్రలేస్తే ఆ ప్రాంతంలో పరిస్థితులు మారిపోతుంటాయి. ఇటువంటి కారణాల నేపథ్యంలో భారత్ పలు సవాళ్లను ఎదుర్కొంటోంది'' అని గోర్ వ్యాఖ్యానించారు. మరో సంఘటనను ప్రస్తావిస్తూ...''మా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఓ రోజు ఉదయాన్నే భారత ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్‌చేసి మాట్లాడాలనుకున్నారు. భారత్‌లో అప్పుడే తెల్లవారి ఉంటుందని నేను తటపటాయింపుతో చెప్పాను. అప్పుడు ట్రంప్ ఏం ఫర్వా



లేదని అన్నారు'' అంటూ వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న గోర్ మోదీట్రంప్ స్నేహబంధాన్ని ప్రస్తావించారు. ద్వైపాక్షిక సంబంధాలకు అది మూలస్తంభమన్నారు.

**ఏం జరిగిందంటే..**

''రెండు నెలల కిందట మియామీలో యూఎఫ్‌సీ కార్యక్రమం జరిగింది. ఆ సమయంలో నేను ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటున్నాం. 'మోదీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలే అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన (మోదీ) ఎక్కువసేపు పడుకోరు. నిద్రలేచే ఉంటారు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే పనుల్లో ఉండటంతో మోదీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే ఈ ఘటన వారిద్దరి మధ్య మైత్రిని చెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే అన్నిటినీ షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోదీ ఆయనకు గొప్ప స్నేహితుడు'' అని గోర్ వెల్లడించారు.

## ఇంటింటి సర్వేకు స్వస్తి..నాయకులతో దోస్తీ

**హైదరాబాద్:**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటరు సర్వేను అధికారులు గందరగోళంగా మార్చారు. పనిచేయడానికి బద్ధకించిన కొందరు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు).. ఓటరు నమోదు పత్రాలను రాజకీయపార్టీలకు అప్పగిస్తున్నారు. మరికొందరు బీఎల్వోలు రాజకీయపార్టీల ఒత్తిడితో ఎన్యూమరేషన్ పత్రాలను కార్యకర్తలకు ఇచ్చి ఇంటికి వెళ్లిపోతున్నారు. దాంతో ఓటర్లు స్థానిక నేతల ఇళ్లు, పార్టీ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాలతో పాటు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంటింటికీ వెళ్లాల్సిందే.. : ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీకి వారం రోజుల గడువు ఉంది. రోజుకు 100 నుంచి 200 ఫారాలను పంపిణీ చేస్తే గడువు లోపు పంపిణీ పూర్తవుతుంది. ఇళ్లలో ఎవరూ లేకపోతే అలాంటి ఇళ్లకు రెండుమూడుసార్లు వెళ్లాలన్నది నిబంధన. అప్పుడూ కుదరకపోతే ఆ ఇంటి తలుపు లేదా కిటికీల్లోంచి ఫారాలను లోపలికి వేయాలి. సులువుగా పూర్తయ్యే ఈ ప్రక్రియను బీఎల్వోలు పని భారంగా భావిస్తున్నారు. రాజకీయ పార్టీలతో చేతులు కలిపి పారదర్శకంగా జరగాల్సిన ఓటరు సర్వేను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ పద్ధతితో అర్హులైన ఓటర్లకు ఎన్యూ



మరేషన్ పత్రాలు అందవు. వారి ఓటరు గుర్తింపు కార్డులు సర్2026 జాబితాలో ఉండవు.

**సానుభూతిపరులకే ఓటు?**

దాదాపు ప్రతి నియోజకవర్గంలో ఏదో ఓ పార్టీకి అనుకూలంగా ఉండే బస్తీలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు కొన్ని ఉంటాయి. అలాంటిచోట ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీలో వివక్ష చోటు చేసుకుంటోంది. కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం బస్తీల్లో చిచ్చు రేపుతోంది.ఇదేంటని అడిగితే మీఇంటికి తాళం వేసి ఉండటంతో ఇవ్వలేకపోయామని బీఎల్వోలు సమాధానమిస్తున్నారు.

**సమస్యలు ఇలా..**

మలక్‌పేట్ నియోజకవర్గం చావుని డివిజన్‌కు చెందిన ఓ ఓటరు బీఎల్వోకు ఫోన్ చేసి ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వాలని కోరారు. డివిజన్‌లోని డైనమిక్ హైస్కూల్ పక్కనున్న ఎంఐఎం పార్టీ ఆఫీసుకు వెళ్లి సల్మాన్‌ను సంప్రదించాలని, ఆయన వద్ద ఫారాలున్నాయని బీఎల్వో సమాధానమిచ్చాడు. పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఓటరు సర్వే ఇలాగే కొనసాగుతోంది. అధికారులు కేవలం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో బీఎల్వో ఓ ఇంటి వద్దకు ఓటర్లను పిలిపించుకుని ఫారాలను పంపిణీ చేశారు.

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి డివిజన్‌లో ప్రజాప్రతినిధికి చెందిన ఫంక్షన్‌హాల్ కేంద్రంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరుగుతోంది. కార్యకర్తలే ఓటర్లను పిలిపించి వాటిపై సంతకాలు తీసుకుంటున్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీకృష్ణానగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ప్రజాప్రతినిధి అనుచరులే ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారు. కొందరికి మాత్రమే ఇస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కమ్మేస్తున్న పొగ.. కాలుష్యం సెగ



**హైదరాబాద్:**

సాధారణ ప్రాంతాలతో పోలిస్తే పైవంతెనలు ఉన్నచోటే వాయునాణ్యత క్షీణిస్తోందని పర్యావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పెరుగుతున్న రద్దీతో వాయునాణ్యతా సూచీ ఈ ప్రాంతాల్లో పరిమితులకు మించి నమోదవుతోంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ 'స్టేట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్' రిపోర్టు, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదికలు ఈ విషయాన్ని వెల్లడించాయి. పైవంతెనలతో రహదారి వాహన సామర్థ్యం కేవలం 30శాతం మాత్రమే పెంచగలదని, వీటివల్ల కలిగే ప్రయోజనాలు కేవలం ఒక కిలోమీటరు పరిధి కంటే తక్కువగా ఉంటోందని వెల్లడించాయి.

**టన్నెల్ ఎఫెక్ట్ తో..**

ఎక్కువమంది పైవంతెనలపైనే వెళ్తుంటారు. దీంతో కొద్దిరోజుల్లోనే ఆ ప్రాంతం ట్రాఫిక్‌తో నిండిపోయి శబ్ద, వాయుకాలుష్యం అత్యధికంగా నమోదవుతున్నాయి. పీఎం 10, పీఎం 2.5 సూక్ష్మధూళి కణాల స్థాయి ప్రమాదకరంగా పెరుగుతున్నాయి. వాహనాలు నిలిచిపోవడం, గాలి స్వేచ్ఛగా వీచకపోవడం (టన్నెల్ ఎఫెక్ట్) వల్ల విషవాయువులు అక్కడే పేరుకుపోతున్నాయి. మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం పైవంతెన ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇక్కడ కార్సినోజెనిక్ కారకాలు, ధూళి కణాలు గరిష్ఠంగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి, బయోడైవర్సిటీ పైవంతెన సమీపంలో వాహనాల రాకపోకలు పెరగడం, టైర్ల ఘర్షణ వల్ల వెలువడే మైక్రోప్లాస్టిక్‌ల కారణంగా గాలి నాణ్యత క్షీణిస్తోంది. కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాల్లో వాహనాల సాంద్రత పెరిగి వాయుకాలుష్యం పెరుగుతోంది.

**సూక్ష్మధూళి కణాల ప్రభావం ఇదీ..**

గాలిలో ఉండే సూక్ష్మధూళి కణాలు నేరుగా శ్వాసకోశ వ్యవస్థను, కంటి ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి ఆస్తమా, గుండె జబ్బులు, కండ్ల కలక, ఎలర్జీలకు దారి తీస్తుంది. దుమ్ముతో కళ్లు ఎర్రబడటంతో పాటు పొడిబారుతాయి. ః ఘనపు మీటరు గాలిలో 12 మైక్రోగ్రాముల వరకు ఎలాంటి ప్రభావం ఉండదు. 35 మైక్రోగ్రాముల వరకు సున్నితమైన వ్యక్తులకు (వృద్ధులు, ఆస్తమా రోగులు)

**గాలి నాణ్యత మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలివే..**

పైవంతెనల వద్ద వర్టికల్ గార్డెన్‌లను పెంచడం వల్ల అవి కర్బన ఉద్గారాలను పీల్చుకొని గాలిని శుద్ధి చేస్తాయి. ప్రధాన జంక్షన్లలో మినహా మిగిలిన చోట్ల వీటిని ఏర్పాటు చేయలేదు.

రద్దీ ఎక్కువగా ఉండే పైవంతెనల సమీపంలో నీటి తుంపరులను చల్లే యాంటీ స్మాగ్‌గన్స్ ఏర్పాటు చేయాలి. కొన్ని రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గాల్లోని సూక్ష్మధూళి కణాలను కింద పడేలా చేయొచ్చు.

స్మార్ట్ సిగ్నలింగ్ ద్వారా వాహనాలు ఎక్కువ సమయం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలి.

పైవంతెనల కింద దుమ్ము రోడ్డుపైకి లేవకుండా రాత్రివేళల్లో స్వీపింగ్ యంత్రాలతో నిరంతరం శుభ్రం చేయాలి. కానీ తూతూమంత్రంగా శుభ్రం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశిత పరిమితుల ప్రకారం..గాలిలో సూక్ష్మధూళి కణాలైన పీఎం 10 స్థాయి ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములు ఉండొచ్చు. పీఎం 2.5 ఘనపు మీటరు గాలిలో 40 మైక్రోగ్రాములు మించొద్దు. కానీ నగరంలో పరిమితికి మించి నమోదవుతోంది.



## ఇక్కడ 43... అక్కడ 43 ఒకటి కాదు!

**వుదయం డెస్క్:**

ఐరోపాలో ఈ ఏడాది వేసవి సెగలు పుట్టిస్తోంది. జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎండ దెబ్బల కారణంగా వందల మంది చనిపోతున్నారు. జర్మనీ, స్లోవేకియా, పోలండ్‌వంటి దేశాల్లో అత్యధికంగా 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 43 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికే అంత తీవ్రత ఉంటుందా అని మనకు డౌట్ రావొచ్చు.. కానీ మన దగ్గర 43కు అక్కడ 43కు ఎంతో తేడా ఉంటుంది. ఐరోపా ఖండంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. అవి తాజాగా బాల్కన్స్, ఉక్రెయిన్‌లవైపు మళ్లుతున్నాయి. బెల్‌గ్రేడ్, బుకారెస్టులలో 37, 38 డిగ్రీలకు చేరుకున్నాయి. స్లోవేకియాలో ఏకంగా 40.5 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. జర్మనీలో అత్యధికంగా 41.7 డిగ్రీలు నమోదైంది. ఎండలకు వడ గాలులు తోడుకావడంతో జూన్ 21 నుంచి ఇప్పటిదాకా ఒక్క ఫ్రాన్స్‌లోనే దాదాపు 1,000 మరణాలు చోటుచేసుకున్నాయి.

ఉష్ణోగ్రతల తీవ్రత భౌగోళిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. దీంతోపాటు గాలిలో తేమ, ఇళ్ల నిర్మాణ శైలి, పట్టణ వాతావరణ పరిస్థితులను బట్టి ఉంటుంది.

భారత్‌తో పోలిస్తే ఐరోపా ఖండంపై సూర్యరశ్మి పడే విధానం భిన్నంగా ఉంటుంది. భారత్‌లో సూర్యరశ్మి.. నడినెత్తి నుంచి పడుతుంది. అదే ఐరోపాలో ఒక యాంగిల్‌లో పడుతుంది. అంతే కాకుండా వేసవిలో పగటి సమయం అధికంగా ఉండటంవల్ల వేడి ఎక్కువసేపు ప్రభావం చూపుతుంది. యాంగిల్‌లో సూర్యరశ్మి పడటం, సూర్యుడు దగ్గరగా ఉండటంవల్ల ఎండ వేడిమి అధికంగా ఉంటుంది.

చాలా ఐరోపా నగరాల్లో 15 నుంచి 17 గంటలపాటు పగటి సమయమే ఉంటుంది. దీంతో భవనాలు, రోడ్లు, పేవ్‌మెంట్లు సౌరశక్తిని గణనీయంగా శోషించుకుంటాయి. ఫలితంగా ఎక్కువసేపు వేడి ఉంటుంది.

అదే మన దేశంలో చాలా ఎత్తు నుంచి సూర్యరశ్మి పడుతుంది. అంతేకాకుండా పగటి సమయం ఐరోపాతో పోల్చితే చాలా తక్కువగా ఉంటుంది. అయితే మన దేశంలో రేడియేషన్ అధికంగా ఉంటుంది.



ఐరోపాలో ఇళ్లను చలి నుంచి తట్టుకునేలా వేడిగా ఉండేలా నిర్మిస్తారు. అదే భారత్‌లో చల్లగా ఉండేలా నిర్మిస్తారు. ఐరోపాలో చాలా ఇళ్లలో ఫ్యాన్లు ఉండవు. అసలు గతంలో హీటర్లే ఉండేవి. ఇప్పుడు ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతుండటంతో చాలా మంది ఏసీలను బిగించుకుంటున్నారు.

ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలవల్ల..

వాతావరణానికి అలవాటు పడే విధానమూ ఐరోపాలో భిన్నంగా ఉంటుంది. మన దేశంలో 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాల్లో దాదాపుగా సాధారణంగా ఉంటాయి. అదే ఐరోపాలో చలి అయినా. ఎండ అయినా అతిగానే ఉంటాయి.

శరీరం వాతావరణానికి అలవాటు అనేది అత్యంత ముఖ్యమైన అంశం. ఉష్ణ మండలాల్లో ఉండేవారికి ఎండాకాలంలో త్వరగా చెమట పడుతుంది. దీంతో వారు వెంటనే ఆ వాతావరణానికి అలవాటు పడిపోతారు. హృదయనాళాల పనితీరును వెంటనే మెరుగుపరుచుకోగలరు. అదే అరుదుగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే ఐరోపాలో ప్రజలు వెంటనే అలవాటుపడలేరు.

**తేమవల్ల..**

గాలిలో తేమ అంశంవల్లా ఒకే ఉష్ణోగ్రతలున్నా ప్రజలపై భిన్న ప్రభావం చూపే అవకాశముంది. భారత్‌లోని చాలా ప్రాంతాల్లో వేసవి, రుతుపవనాల కాలాల్లో భారీగా గాలిలో తేమ ఉంటుంది. ఇది చెమట ఆవిరయ్యే సమయాన్ని నెమ్మదింపజేస్తుంది. దీని వల్ల వేడి ఎక్కువగా ఉన్న భావన కలుగుతుంది. దీనికి శరీరాలు అలవాటు పడతాయి. భారత్‌లో అధిక కాలుష్యం వల్ల సూర్యరశ్మి తీవ్రత తగ్గుతుంది. అదే ఐరోపాలో ఎండ నేరుగా శరీరాలపై పడుతుంది.

ఐరోపాలో వడగాడ్పుల సమయంలో అసలు గాలి ఉండకపోవడం, తక్కువగా ఉండటం సంభవిస్తాయి. అదే భారత్‌లో అయితే ఈ వడగాడ్పులు.. వేడి, పొడి గాలులతో కలిసి వస్తాయి.

## పాక్ వద్దు భారత్‌తోనే ఉంటాం

**వుదయం డెస్క్:**

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పై పాక్ నియంత్రణ వద్దని, తాము భారత్‌తోనే ఉంటామని నిరసనకారులు తెగేసి చెబుతున్నారు. పీవోకేలోని రావలకోట్‌లో వేలమంది ప్రజలు చేపట్టిన నిరసనలు మంగళవారం 22వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం ఈద్గా మైదానంలో వక్తలు మాట్లాడుతూ పీవోకే పాక్‌లో భాగంగా ఎంతమాత్రం పరిగణించరాదన్నారు. పాలన, ఆర్థిక కష్టాలు, ద్రవ్యోల్బణం, ప్రభుత్వపరంగా అణచివేత, పరిపాలనలో నిర్లక్ష్యం వంటివాటిని తప్పుపడుతూ ప్రజలు ఈ ఉద్యమం చేపట్టారు. నిరసనల సమాచారం ప్రజలకు చేరకుండా చూడాలని జూన్ 5 నుంచి ఇంటర్నెట్ సేవల్నీ ఆ ప్రాంతంలో నిలిపివేశారు. నిత్యావసరాలు అందకుండా అధికార యంత్రాంగం రెండువారాల ఆంక్షలు విధించడంతో నిరసనకారులు మండిపడుతున్నారు.


**మా వాటాను అడ్డుకునే చేతులు నరికేస్తాం**

ఇంటర్నెట్ డెస్క్: సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ ఒప్పందం విషయంలో యుద్ధానికైనా సిద్ధమేనంటూ ఇటీవల కవ్వింపులకు పాల్పడిన దాయాది.. తాజాగా మరోసారి భారత్‌పై ప్రేలాపనలు చేసింది. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యాఖ్యలు చేశారు. తమ వాటా నీటిని అడ్డుకునే చేతులను నరికేస్తాం అని హెచ్చరించారు. పాక్ మరో మంత్రి అతావుల్లా తరార్ మాట్లాడుతూ..నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు.

## హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద దొంగపై పోలీసుల కాల్పులు

**హైదరాబాద్:**

నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో అతన్ని పట్టుకునేందుకు నల్గొండ సీసీఎస్ పోలీసుల బృందం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లింది. ఆదిభట్ల సమీపంలో అవుటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అతను తిరగబడి తప్పించు




కునేందుకు యత్నించడంతో పోలీసులు కాల్పులు జరిపినట్లు సమాచారం. విచారణలో నిందితుడిని ఏపీకి చెందిన భూష్మి శ్రీకాంత్‌గా గుర్తించిన పోలీసులు గాయాలతో ఉన్న అతన్ని వనస్థలిపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అతడిపై పదికి పైగా దొంగతనాల కేసులు, నాలుగేళ్ల క్రితం ఏపీలో ఓ కానిస్టేబుల్‌ను హత్య చేసిన కేసు కూడా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు బుధవారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఆగస్టు 30న నీట్ పీజీ పరీక్ష.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ

**వుదయం డెస్క్:**

వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (NEET PG 2026)కు షెడ్యూల్ విడుదలైంది. ఆగస్టు 30న పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ప్రకటించింది. ఈ రోజు సాయంత్రం



5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, జులై 21 వరకు ఈ రిజస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికగా నీట్ పీజీ పరీక్షను నిర్వహించేందుకు ఎన్‌బీఈఎంఎస్ ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష కేంద్రానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని ఆగస్టు 11నే అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొంది. సెప్టెంబర్ 30 నాటికి ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపింది.

## దర్యాప్తులో కీలకంగా మారిన గేట్ అనాలసిస్..!

**వుదయం డెస్క్:**

పుణె యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. లోహ్‌గఢ్ కోటకు నిందితుడు చేతన్ చౌదరిని సీన్ రీక్రియేషన్ కోసం తీసుకెళ్లారు. విచారణలో భాగంగా పోలీసులు ఫోరెన్సిక్ విశ్లేషణలో కీలకమైన గేట్ అనాలసిస్ (Gait analysis) చేయాలని యోచిస్తున్నారు. అందుకోసం సీన్ రీక్రియేషన్ వీడియోను సీసీటీవీ ఫుటేజీతో పోల్చి చూడనున్నారు.

**ఏంటీ గేట్ అనాలసిస్..**

దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ బృందం కొన్ని కేసుల్లో ఒక వ్యక్తి నడిచే తీరును కూడా పరిశీలిస్తుంది. దీనిని గేట్ అనాల



సిస్ (Gait analysis)గా పేర్కొంటారు. సీసీటీవీ ఫుటేజీలో కనిపించే అనుమానితులను పోల్చుకునేందుకు ఈ టెక్నిక్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఈ విశ్లేషణలో భాగంగా అడుగుల మధ్య దూరం, శరీర భంగిమ, చేతుల కదలిక, నడిచేటప్పుడు మొత్తంగా శరీరం కదలికల వంటి వాటిపై దృష్టిసారిస్తారు. ఎత్తు, శరీరాకృతిపరంగా మనుషుల మధ్య పోలికలు ఉన్నప్పటికీ.. శరీర నిర్మాణం, కండరాల కదలికలు, గతంలో అయిన గాయాలు, అలవాటైన కదలికల కారణంగా ప్రతి వ్యక్తికి వారికంటూ ఒక ప్రత్యేకమైన నడక అలవడుతుంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సుజాతనగర్ ఉపాధి హామీ పథకంలో మళ్లీ అవకతవకలా..?

## కేవైసీ ముఖ గుర్తింపు వ్యవస్థకూ గండి..!

**సామాజిక తనిఖీల్లో గతంలో బయటపడిన అవకతవకల నుంచి పాఠాలు నేర్చుకోలేదా..?**

**ప్రజావాణిలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బేతంపూడి స్టేషన్ గ్రామస్థులు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 01 (వుదయం ప్రతినిధి)**

సుజాతనగర్ మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై మరోసారి తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సామాజిక తనిఖీల్లో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చి ప్రభుత్వానికి లక్షల రూపాయల నష్టం జరిగినట్లు నివేదికలు వెల్లడించినప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనుల్లోనూ అదే తరహా అక్రమాలు కొనసాగడంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా ప్రస్తుతం అమలులో ఉన్న కేవైసీ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు వ్యవస్థను సైతం కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు దుర్వినియోగం చేయడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పని ప్రదేశంలో కార్మికులు లేకుండానే నకిలీ లేదా డిజిటల్‌గా రూపొందించిన ఫోటోలను అప్లోడ్ చేసి హాజరు నమోదు చేస్తు ఫీల్డ్ అసిస్టెంట్లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.గతంలో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చిన తరువాత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశించినప్పటికీ, ప్రస్తుతం కూడా పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే అక్రమాలకు అవకాశం కలుగుతోందా? లేక అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం కొనసాగుతోందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.మండల ఎంపీడీవో దృష్టికి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వార్తలు ప్రచురితమైనా, సంబంధిత అధికారుల చర్యలు కేవలం నోటీసులకే పరిమితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. తప్పు చేసిన వారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల అక్రమాలకు పాల్పడే వారికి మరింత ధైర్యం వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇటీవల బేతంపూడి స్టేషన్ గ్రామ పంచాయతీ పరిధిలో నకిలీ వ్యక్తులతో హాజరు నమోదు చేసినట్లు వుదయం దినపత్రికలో వెలువడగా, సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదే ఫీల్డ్ అసిస్టెంట్ జమలతండ గ్రామపంచాయతీలోనూ విధులు నిర్వహిస్తూ అక్కడ కూడా ముఖ గుర్తింపు విధానాన్ని పక్కదారి పట్టిస్తు డిజిటల్ ఫోటోలను అప్లోడ్ చేయడం మరింత అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి.ఇదిలా ఉండగా, బేతంపూడి స్టేషన్ గ్రామపంచాయతీకి చెందిన పలువురు గ్రామస్తులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెం ట్‌పై భారీ అవకతవకలకు పాల్పడ్డారంటూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకం పేదల జీవనోపాధికి కీలకమైన సంక్షేమ కార్యక్రమం. అలాంటి పథకంలో అవినీతి, నకిలీ హాజరు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ కమిటీని నియమించి, బాధ్యులపై కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.సుజాతనగర్ మండల ఏపీవో వివరణ చరవాణిలో కోరగా...సుజాతనగర్ మండలం జమలతండ గ్రామపంచాయతీ ఉపాధి హామీ పథకంలో జరిగిన డిజిటల్ ఫోటోల హాజరు వ్యవహారంపై సంబంధిత మండల ఉపాధి అధికారి ఏపీఓ వివరణ కోరగా డిజిటల్ ఫోటోలకు సంబంధించిన విషయం మా దృష్టికి వచ్చింది. నాలుగు రోజులపాటు అలా చేయడం మా దృష్టికి రాగానే సంబంధిత మేటును తొలగించి ఫీల్డ్ అసిస్టెంట్ కు నోటీసులు జారీ చేశామని తెలిపారు.




## ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్



**సూర్యాపేట, జులై 1 వుదయం ప్రతినిధి**

జిల్లా కేంద్రంలో అనునిత్యం పెరుగుతున్న ప్రజలు, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్తున్నామని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. బుధవారం కొత్త బస్టాండ్ చౌరస్తా, ఖమ్మం ఎక్స్ రోడ్ చౌరస్తాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును ఎస్పీ పరిశీలించారు. సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్టీసీ డివిజనల్ మేనేజర్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంలతో కలిసి ఎస్పీ సిగ్నల్స్ పనితీరు, పోలీస్ సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ "వాహనాల రద్దీని పునరుద్ధరించి సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంలో భాగంగా ఆధునిక పద్ధతుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించాం. వాహనదారులు, ప్రజలు మరింత అవగాహన కలిగి ఉండి సిగ్నల్స్‌ను తప్పక అనుసరించాలి. ఇతర వాహనాలకు ఇబ్బందులు కలగకుండా ప్రయాణించాలి" అని కోరారు."రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని సర్దుబాటు చేయడానికి ఆపరేషన్ రోప్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించాం. పాదాచారుల ప్రయాణానికి అనుకూల వాతావరణం కల్పించాలి. స్థానిక వ్యాపారులు రోడ్లను ఆక్రమించవద్దు" అని సూచించారు. "పోలీసు సిబ్బంది సామర్థ్యంతో పని చేస్తూ ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తున్నారు. ఆటోలు, ఇతర పెద్ద వాహనాలు సిగ్నల్స్ వద్ద అప్రమత్తంగా ఉండాలి. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం, జరిమానాలు చెల్లించాల్సి వస్తుంది" అని ఎస్పీ హెచ్చరించారు.

## డాక్టర్స్ డే సందర్భంగా చర్ల (కొయ్యూరు) పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**చర్ల, జూలై 1: (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం చర్ల మండలంలోని కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, రికార్డులను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.డాక్టర్స్ డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారికను, డాక్టర్ పూజ, నర్సింగ్ ఆఫీసర్లు సుశీల, ఉమలను జిల్లా వైద్యాధికారి శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రజలకు అంకిత భావంతో వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని అధికంగా డెంగ్యూ, మలేరియా కేసులు నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి ఇంటింటి సర్వేలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లను తరచూ సందర్శించి విద్యార్థులకు తగిన జాగ్రత్తలు తెలుపుతూ వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు పరిధిలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి, వైద్య సిబ్బంది పనితీరును అభినందిస్తూ రానున్న రోజుల్లో ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు సేవ చెయ్యాలని సూచించారు.

## ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి!



**హనుమకొండ/ఐనవోలు, జులై 01(వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాలుగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆకాంక్షించారు. బుధవారం ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు బ్లాక్‌బోర్డుపై చాక్ పీస్ పట్టి గణితం బోధించారు. విద్యార్థుల అవగాహన, ప్రతిభను పరిశీలిస్తూ సులువుగా లెక్కలు నేర్పడం అటు పిల్లల్లో ఉత్సాహాన్ని, ఇటు ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపింది. అనంతరం ప్రధానోపాధ్యాయుడు పి. ఆనందంతో మాట్లాడిన కలెక్టర్.. విద్యార్థుల పఠన, గణిత నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను వినియోగించుకుంటూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రం, ప్రగతి పనుల పరిశీలన:పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, బాలామృతం పంపిణీని పరిశీలించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలోని డంపింగ్ యార్డ్, నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ గిరిరాజ్‌గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, సర్పంచ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం!

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి




**వరంగల్ క్రైం, జూలై 01 (వుదయం ప్రతినిధి):**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి తెలిపారు.బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె, ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు నూతన కమిషనర్ కు వందనం సమర్పించారు.అనంతరం కమిషనర్కార్యాలయంలో వెళ్తున్న మాజీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుంచి నూతన పోలీస్ కమిషనర్ గాఎన్. శ్వేతా రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, నోట్‌బుక్‌లను సీపీకి అందజేసి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన అదనపు సిఇఓ



**ఖమ్మం, వుదయం, బ్యూరో జూలై 1**

అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అదనపు సీఈవో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. ఈ. శ్రీజ తో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. బుధవారం కూసుమంచి మండలం జుజ్జుల్ రావుపేట, కొనిజర్ల మండలం తనికెళ్ళ, వైరా మండలం కేజీ సిరిపురం గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సరళిని అదనపు సిఇఓ పరిశీలించారు.ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు సీఈవో, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), సూపర్వైజర్ల పని తీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ధ్రువీకరణ ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, దోషరహితంగా రూపొందించడమే లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని, ఫారాల నింపడంలో సహకరించాలని అదనపు సిఇఓ అన్నారు.బీఎల్‌వోలు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో ఎస్ఐఆర్ కీలకమని, ఈ ప్రక్రియను సమయపాలనతో పూర్తి చేయాలని అన్నారు. అదనపు సిఇఓ తనిఖీ సందర్భంగా మండల తహశీల్దార్లు, బిఎల్ఓ లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ..



**రాయపర్తి జూలై 1 (వుదయం ప్రతినిధి):**

వివిధ అనారోగ్యాలతో ఆసుపత్రిలో చేరి ఆరోగ్య శ్రీ వర్తించని, చికిత్స చేయించుకున్న పేదలకు ఆర్థిక చేయూతనిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి' పంపిణీ చేయనున్నారనీ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంట రవీందర్ రెడ్డి అన్నారు. మండల నాయకులు,ప్రజాప్రతినిధులు, అధికారులు,మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు,అనుబంధ సంఘాల నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,సోషల్ మీడియా నాయకులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు.

## డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాల భద్రతకు అత్యంత బాధ్యత వ్యవహరించాలిఎస్.ఐ. ఎం.సాంబమూర్తి



**మహాదేవ్‌పూర్ జులై 01(వుదయం ప్రతినిధి)**

స్కూల్ బస్సుల డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాల భద్రతకు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలి అని మహాదేవపూర్ ఎస్.ఐ. ఎం.సాంబమూర్తి అన్నారు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఎస్.ఐ. ఎం. సాంబమూర్తి స్కూల్ బస్సు డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్.ఐ. ఎం. సాంబమూర్తి మాట్లాడుతూ, స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాల భద్రతకు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని సూచించారు బస్సులో విద్యార్థులను నిర్ణీత సామర్థ్యానికి మించి ఎక్కించరాదని, వాహనం బయలుదేరే ముందు బ్రేకులు, టైర్లు, లైట్లు తదితర అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని తెలిపారు. విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో మరియు దిగే సమయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల యాజమాన్యం మరియు తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు.పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అతివేగంగా వాహనం నడపవద్దు అని మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దు అని డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దు.విద్యార్థులను నిర్ణీత సామర్థ్యానికి మించి ఎక్కించవద్దు అని ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

## ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలకు కీలక సూచనలు

**అనంతగిరి రైతు వేదికలో ఆర్టీవో, తహసీల్దార్ అవగాహన కార్యక్రమం**



**అనంతగిరి జూలై 01 వుదయం**

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బీఎల్‌వోలకు వివిధ పార్టీ నాయకులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్టీవో, తహసీల్దార్ పాల్గొని గ్రామాల్లో బీఎల్‌వోలు చేపడుతున్న ఓటరు నమోదు, సవరణ, మార్పులు, తొలగింపుల ప్రక్రియను సమీక్షించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు వివిధ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ఎమ్మారై సేవలు ప్రారంభం

**పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



జయశంకర్ భూపాలపల్లి జులై 01(వుదయం జిల్లా ప్రతినిధి)పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం యంత్రం పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మారుమూల జిల్లాగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.గత ఏడాది ఆస్పత్రిలో రోగుల అవసరాల కోసం వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.14 కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరహాలో ఇతర బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసు పత్రి తర్వాత ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేసిన ఆసు పత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై సేవల నిర్వహణ కోసం ఇద్దరు నిపుణులైన ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు.ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్, హనుమకొండకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై భూపాలపల్లిలోనే ఉచిత ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే భూపాలపల్లి జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.
అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, హెచ్ డీ ఎఫ్ సి క్లస్టర్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లి, ఖిలాషాపూర్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**జనగామ, జూలై 01 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే తల్లిదండ్రులకు నిజమైన సంతోషం లభిస్తుందని, విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం ఆయన రఘునాథపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలను, ఖిలాషాపూర్ లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో 'అన్ అకాడమీ' డిజిటల్ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా సులభమైన పద్ధతిలో గణిత పాఠాలను బోధించారు. విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకొని కెరీర్‌లో స్థిరపడాలని ఆకాంక్షించారు.కలెక్టర్ ముఖ్యమైన ఆదేశాలు జారీ చేశారు. అభ్యాసన సామర్థ్యాల పెంపు, విద్యార్థుల పఠన, అభ్యాసన నైపుణ్యాలను మెరుగుపరచడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పాఠశాలల పారిశుద్ధ్యం, వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.మౌలిక వసతులు, తరగతి గదులు, తాగునీటి సౌకర్యాలు, టాయిలెట్లను నిరంతరం శుభ్రంగా ఉంచాలి. పారిశుద్ధ్యంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదు.మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలి.

## నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు:

## చండూరు మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం హెచ్చరిక

**చండూరు, జూలై 01 (వుదయం):**

మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమా ణాలు ఖచ్చితంగా పాటించాలని చండూరు మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS), కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (KGBV) ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వంటశాల, భోజనశాలలను పరిశీలించి, వంటకాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి భోజనం రుచి, నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం కేజీబీవీలో నిర్వహిస్తున్న పలు రికార్డులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేయాలని, తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి పాఠశాలలోని మొక్కలకు వినియోగించాలని పిలుపునిచ్చారు.

# కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, జూలై-1 (వుదయం ప్రతినిధి)**



ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని, ప్రతి రైతు ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేయాలని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అన్నారు.బుధవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింత కుంట విజయరమణారావు మాట్లాడుతూ, తన 60 సంవత్సరాల జీవితంలో ఈ ప్రాంతం నీటి కోసం పడిన ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశానని, ఎస్ఆర్ఎస్పీ డి-83, డి-86 కాలువల రాకతో ఈ ప్రాంత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా 1.20 నుంచి 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు పెద్దపల్లి నియోజకవర్గంలోనే ఉందన్నారు. డి-86 కింద 87 వేల ఎకరాలు, డి-83 కింద 35 వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు.ప్రస్తుతం నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న దిగుబడులు అధికంగా వస్తున్నాయని, ఈ సీజన్‌లో 2.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 27 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే చెల్లింపులు అందుతున్నాయని పేర్కొన్నారు.వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించిన ఆయన, యూరియా బుకింగ్ యాప్‌ను తొలిసారిగా పెద్దపల్లి జిల్లాలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా కూడా ఇదే తరహా విధానాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గి భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు గుర్తించాలని సూచించారు. రైతులు వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, తెలంగాణ రాష్ట్రం ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు మొక్కలు అందజేస్తోందని, నాలుగేళ్ల తర్వాత ఎకరాకు సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ నాలుగేళ్లలో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటల సాగుపై దృష్టి పెట్టాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, శివపల్లి గ్రామంలో ఒకేసారి 120 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. దీనిని చూసి మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ఆకర్షితులవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.గత రెండేళ్లుగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోందని, శ్రీరాంపూర్ మండలంలో కొత్త ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవుతోందన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ ధర టన్నుకు రూ.23 వేల వరకు పెరగడంతో రైతులకు మరింత ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు.చిన్న, సన్నకారు రైతులు, ఒంటరి మహిళా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపడితే మొక్కల నాటకం, డ్రిప్ ఏర్పాటు వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అవసరమైతే బోర్లు, విద్యుత్ కనెక్షన్లు కూడా కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరో 50 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తే కొత్త రహదారి మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, శ్రీరాంపూర్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఎండీ. శ్యామ్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, (వుదయం ప్రతినిధి):**



ఆహార వ్యాపార సంస్థలన్నీ తప్పనిసరిగా పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు.బుధవారం భుక్తపూర్‌లోని తనిష్క్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహార భద్రతా, పరిశుభ్రత నిబంధనలు, FSSAI లైసెన్స్, FoS-TaC శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆహార భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రతి వ్యాపారి తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే FSSAI లైసెన్స్‌తో పాటు FoSTaC శిక్షణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు.ఆహార భద్రతా అధికారి సునీత మాట్లాడుతూ, నిబంధనల అమలుపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం FoSTaC శిక్షణ కార్యక్రమం అమలులో ఉందని తెలిపారు. వినియోగదారుల భద్రత కోసం ప్రతి వ్యాపారి తమ లైసెన్స్‌లు, సర్టిఫికెట్లను స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆమె సూచించారు.కార్యక్రమం అనంతరం శిక్షణ పూర్తి చేసిన వ్యాపారులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ టి. సింధు, స్టేట్ ఇంచార్జి ఎస్. బాలకిరణ్, జి.ఎం. కె. దీపు కుమార్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌లు అమరేందర్, సోహెల్, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం

**కామారెడ్డి, జూలై 1 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలపడం తన లక్ష్యమని తెలిపారు.కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని అన్నారు. తాను విద్యాభ్యాసం చేసిన కామారెడ్డి బాయ్స్ హైస్కూల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు ఏ మాత్రం తీసిపోకుండా అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కామారెడ్డి బాయ్స్ హైస్కూల్‌లో ఏసీ తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్స్, ఆధునిక సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, స్మార్ట్ లైబ్రరీ, పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం, ప్రత్యేక క్రీడా మైదానాలు, విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో రాష్ట్రంలోనే రోల్ మోడల్ ప్రభుత్వ పాఠశాలగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ పనులకు సీఎంఆర్ నిధులతో పాటు అవసరమైతే తన సొంత నిధులను కూడా వినియోగించి త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు జర్మన్ టెక్నాలజీ డేలైట్ ఇంద్ర గాంధీ స్టేడియం ఏర్పాటుకు ఎంఎస్ఎన్ ఫార్మా సంస్థ సీఎస్ఆర్ నిధులు 78 లక్షల తో బాధ్యతలు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం కేటాయించిన తొమ్మిది కోట్ల రూపాయలతో 8 లేన్ అథ్లెటిక్స్ ట్రాక్, నాలుగు టెన్నిస్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, యోగా భవన్, ఆధునిక జిమ్, మహిళలు-పురుషులకు వేర్వేరు డ్రెస్ చేంజింగ్ రూములు, రైఫిల్ షూటింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మిస్తామని వెల్లడించారు. కామారెడ్డి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవ్వాలన్నదే తమ సంకల్పమన్నారు. దోమకొండ మండల కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో ఫైర్ స్టేషన్, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు లభించాయని తెలిపారు. ఈ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు అందిస్తూ ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా ఆధునిక రహదారులు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాల విస్తరణ, పార్కుల అభివృద్ధి, జంక్షన్ల సుందరీకరణ, సీసీ రోడ్లు, పట్టణ పరిశుభ్రత, భూగర్భ మురుగు కాలువల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, రైతులకు విద్యుత్, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, పల్లె ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, మహిళా సంఘాలకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

కామారెడ్డి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించి యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ రైతులకు సాగునీరు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల ఆదాయం పెంచేందుకు మార్కెటింగ్ సదుపాయాలు, గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.కామారెడ్డి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ఎస్ఐఆర్ ఫారాల్లో వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి

ఓటర్లకు బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, జూలై 01: {వుదయం ప్రతినిధి} :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల్లో అన్ని వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని 33వ వార్డులో బూత్ నంబర్లు 163, 164, 166 పరిధిలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు ఇప్పటికే పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపించడంతో పాటు, తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోను సేకరించాలని సూచించారు. ఫారంలోని ప్రతి అంశాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేసి, వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు.ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు.ఈ పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్‌బాబు, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రారంభం

ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, జూలై 1 {వుదయం ప్రతినిధి} :**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కొత్తపేట గ్రామానికి వేములవాడ డిపో నుంచి నూతన ఆర్టీసీ



బస్సు సర్వీసును రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన ఆయన గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేస్తున్నామని, ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కొత్తపేట గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఈ నూతన బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.కొత్తపేట నుంచి రుద్రంగి మీదుగా వేములవాడ వరకు ప్రజలు కోరుకున్న సమయాల్లో బస్సు నడిచేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సర్వీసుతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, సాధారణ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. వేములవాడ నుంచి ఇప్పటికే ముంబై, భద్రాచలం, కాలేశ్వరం, యాదగిరిగుట్ట వంటి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యాలు కల్పించామని, త్వరలోనే వేములవాడ-బాసర మధ్య కూడా నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తామని వెల్లడించారు. కొత్తపేట గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, త్వరలోనే గ్రామానికి నూతన రహదారి, వంతెన నిర్మాణం చేపడతామని తెలిపారు. మహిళా సమాఖ్య సంఘానికి రూ.10 లక్షలు మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కొత్తపేటను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, అర్హులైన నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. రానున్న రోజుల్లో కొత్తపేటను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట్, జులై 1 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంటశాలను సందర్శించి విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీకి తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల పరిధిలోని గ్రామపంచాయతీల కార్యదర్శులు, బూత్ స్థాయి అధికారులు, వాలంటీర్లకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తహసిల్దార్ దిలీప్ కుమార్ దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఓటరు జాబితా తయారీలో ముసాయిదా జాబితా రూపకల్పన ముఖ్యమని తెలిపారు. ఆర్టికల్ 326 ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించే విధంగా ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 2002 సంవత్సరంలో ఓటు హక్కు కలిగిన వారి కుటుంబ సభ్యులను అనుసంధానం చేస్తూ ప్రస్తుత సవరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 72 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. నూతన ఓటరు నమోదు కొరకు ఫారం 6 తో పాటు డిక్లరేషన్ తీసుకుని ఓటు నమోదు చేయవచ్చని, ఓటు తొలగింపు, 2 అంతకంటే ఎక్కువ ఎపిక్ కార్డులు కలిగిన వారు ఒకే కార్డు ఉండేలా చూడాలని తెలిపారు. ఆన్లైన్ లో సైతం ఎన్యుమరేషన్ ఫారం నింపవచ్చని తెలిపారు. ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారం నింపేందుకు బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత, చదువుకున్న వారు సహాయం అందించాలని, ఒకరు ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే కలిగి ఉండేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని తెలిపారు.

మరణించిన, గ్రామం వదిలి వెళ్ళిన, 2 మించి ఓటరు కార్డులు కలిగిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత సేకరించి బి ఎల్ ఓ యాప్ లో డిజిటలైజేషన్ చేయాలని సూచించారు.

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారులు, జి.పి.ఓ. లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, జూలై 1 (వుదయం ప్రతినిధి):**



ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం మంథనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, బోధనా విధానం, విద్యా పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మంథని పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. తర్వాత కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కళాశాల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కళాశాలల్లో అదనపు మౌలిక వసతుల అవసరం ఉంటే సంబంధిత ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) తమ పరిధిలోని ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వాటిని సక్రమంగా నింపడంలో అవసరమైన సహకారం అందించాలని చెప్పారు. ప్రతి ఓటరు నుంచి తప్పనిసరిగా నింపిన ఫారాలను సేకరించి, నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం కమాన్‌పూర్‌లో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, మిగిలిన రినోవేషన్, తుదిదశ పనులను వేగవంతంగా పూర్తి చేసి కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో మంథని ఆర్డీవో సురేష్, మంథని తహసీల్దార్ అరిఫొద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కమాన్‌పూర్ తహసీల్దార్ వాసంతి, పీఆర్ ఏఈ జగదీష్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి..

బీఎల్ఓ ల ఇంటింటి ఫారాల పంపిణీ...జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**జగిత్యాల జులై 01 (వుదయం ప్రతినిధి)**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోరుట్ల పట్టణం కేంద్రంలో బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ లు ఓటర్లకు ఫారాల పంపిణీ వివరాల నమోదు అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలన్నారు ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈప్రక్రియలో చురుకుగా పాల్గొ ని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరుజాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్ అధికారులు బీఎల్ఓ లు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి తహసీల్దార్ హకీమ్ సంబంధిత సిబ్బంది బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షా లు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్

**నిర్మల్ జిల్లా 1 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**



భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో సంభవించే భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నుంచి ముందస్తు జాగ్రత్తల ద్వారా రక్షణ పొందగలుగుతామని అన్నారు. వర్షాకాలం ఎన్డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉంటుందన్నారు. భారీ వర్షాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని వివరించారు. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, చెరువుల కింద ఉన్న ప్రజలకు, లోతట్టు ప్రాంతాల ప్రజలందరికీ వాతావరణ వివరాలు, నీటి మట్టపు వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కుంగిన రోడ్లు, గుంతలు, ప్రమాదకర ప్రవాహాలు ఉండే ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి, ఆవైపు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తేముందు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందుగా సమాచారం చేరవేయాలన్నారు. గర్భిణులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి తగిన చికిత్సలకొరకు సంబంధిత ఆసుపత్రుల్లోకి తరలించాలన్నారు. వరద ముంపు ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల ప్రజలను వరదలు వచ్చే అవకాశం ఉన్న సమయానికి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. రోడ్లు కోతకు గురైతే, విద్యుత్ అంతరాయం కలిగితే ఆ సౌకర్యాల పునరుద్ధరణకు ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ముందస్తు రక్షణపై ఎన్డీఆర్ఎఫ్ బృందం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరద సమయంలో ప్రాజెక్టులు, ప్రమాదకర చెరువుల ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బంది బందోబస్తు ద్వారా రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాలకు ప్రజలెవరూ వెళ్లకుండా ఉండేలా పోలీసు శాఖ తరుపున కృషి చేస్తామని వివరించారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవిస్తే రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు సాంకేతిక విద్యే బలమైన పునాదిఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**నిజాంసాగర్,జూలై 01 (వుదయం ప్రతినిధి):**



విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం ఎన్ఆర్ఐ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకుడు భుజంగారి భాస్కర్ రెడ్డి రూ.84 వేల విలువైన నూతన కంప్యూటర్‌ను విరాళంగా అందించారు. ఈ కంప్యూటర్‌ను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విలువలతో కూడిన బోధన అందించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని సూచించారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహించేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు కూడా ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని అన్నారు. ఇదే సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులు తమ ఉద్యోగ భద్రత, వేతనాలు తదితర సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు చేయూతనందించే దాతలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. భుజంగారి భాస్కర్ రెడ్డి తన స్వంత నిధులతో కంప్యూటర్‌ను అందించడం అభినందనీయమని అన్నారు.

## టాటా సియారాలో విద్యుత్ వర్షన్

టాటా మోటార్స్ తన ఎస్‌యూవీ సియారా మోడల్‌లో ఎలక్ట్రిక్ వర్షన్‌ను విడుదల చేసింది. దీని పరిచయ ధరల శ్రేణి రూ.18.79– 24.79 లక్షలు. సియారా ఎలక్ట్రిక్ వర్షన్‌కు బుకింగ్‌లు మంగళవారమే ప్రారంభమయ్యాయని, జులై 15 నుంచి డెలివరీలు ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. భారత్‌లో విద్యుత్ వాహనాలకు ఆదరణ వేగంగా పెరగడంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు కీలక పాత్ర పోషించాయని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర తెలిపారు.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ, రియాల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 162 పాయింట్ల పైకి చేరింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.23గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# దేశీయ సెమీకండక్టర్ రంగానికి మరో రూ.1.25 లక్షల కోట్లు



ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం) 2.0 కోసం రూ.1.25 లక్షల కోట్ల కేటాయింపు ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యయ విభాగం ఆమోదించినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. చిప్‌ల తయారీలో భారత్‌ను అంతర్జాతీయ ముఖ్య గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం. ఐఎస్‌ఎం 1.0 కోసం కేటాయించిన రూ.76,000 కోట్లతో పోలిస్తే.. ఐఎస్‌ఎం 2.0 కోసం మరింత ఎక్కువగా కేటాయించడం గమనార్హం. ఐఎస్‌ఎం 2.0 ప్రతిపాదనకు ఎక్స్‌పెండిచర్ ఫైనాన్స్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదం కోసం త్వరలోనే పంపనున్నారు.

స్వదేశీ చిప్ డిజైన్, మేధో సంపత్తి, ప్రతిభావంతులైన నిపుణుల తయారీ, అంతర్జాతీయ భాగస్వాములను ఆకర్షించడం, పటిష్ఠమైన సరఫరా వ్యవస్థను నిర్మించడం లాంటి లక్ష్యాలతో ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటికే 12 సెమీ కండక్టర్ల తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి మొత్తం పెట్టుబడి విలువ దాదాపు రూ.1.64 లక్షల కోట్లు. ఇందులో 1 ఫ్యాబ్రికేషన్ యూనిట్, 2 కాంపౌండ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్లు, 9 ప్యాకేజింగ్ యూనిట్లు ఉన్నాయి. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 ప్రాజెక్టులకు ప్రభుత్వం మద్దతు అందిస్తోంది. అడ్వాన్స్‌డ్ చిప్ డిజైన్ టూల్స్ కోసం 105 కంపెనీలకు సహకారం అందిస్తున్నారు. సెమీ కండక్టర్ డిజైన్ విభాగంలో భారత పురోగతి మరింత విస్తృతమవుతోందనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది. ఐఎస్‌ఎంతో దేశంలో సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే రెండు సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. మరో ప్రముఖ ప్రాజెక్టు అయిన 'సీజీ సెమీ' జులై 4న ప్రారంభం కానుంది. ఈ ఏడాది చివరికల్లా మరో రెండు ప్రాజెక్టులు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# 14 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు




దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల (GST Collections) వివరాలను బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. జూన్ నెలలో రూ.1.95 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీలతో వసూలైన వస్తుసేవల పన్ను మొత్తం రూ.1.35 లక్షల కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వసూళ్లు 34.6 శాతం పెరిగి, రూ.60వేల కోట్లకు చేరాయి. జూన్ నెలకు రీఫండ్ల విలువ రూ.32,436 కోట్లు కాగా.. దానిని సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ (GST) వసూళ్లు రూ.1.62 లక్షల కోట్లుగా ఉన్నాయి. జూన్ నెలలో తెలంగాణకు స్థూలంగా రూ.5,050 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాగా.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,548 కోట్లు వచ్చాయి. తెలంగాణలో గతేడాది ఇదే నెలతో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదు చేయగా.. ఏపీ వసూళ్లలో ఐదు శాతం వృద్ధి నమోదైంది. సర్దుబాటు అనంతరం తెలంగాణ నికర జీఎస్టీ ఆదాయం రూ.3,994 కోట్లు కాగా.. ఆంధ్రప్రదేశ్ నికర ఆదాయం రూ.3,144 కోట్లు.

## తక్కువ బ్యాగేజీతో ప్రయాణించేవారి కోసం ఇండిగో లైట్



ఇండిగో పేరిట విమానాలను నడిపే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సరికొత్త ప్లాన్‌తో ముందుకొచ్చింది. తక్కువ లగేజీతో (కేవలం క్యాబిన్ బ్యాగ్ మాత్రమే) ప్రయాణించేవారికి తక్కువ ఛార్జీతో విమానంలో ప్రయాణించేలా 'ఇండిగో లైట్' పేరుతో ప్రత్యేక ఛార్జీల విధానాన్ని తీసుకొచ్చింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఈ విధానం వర్తిస్తుంది. డైరెక్ట్ ఫ్లైట్లలో మాత్రమే అనుమతిస్తారు. ఇందులో సాధారణ ఎకానమీ టికెట్లతో పోలిస్తే టికెట్ ధరలు తక్కువగా ఉంటాయి. ఇండిగో లైట్ కింద కేవలం 7 కేజీల వరకు క్యాబిన్బ్యాగ్‌ను మాత్రమే అనుమతిస్తారు. అదనపు రుసుము లేకుండా ఆటోమెటిక్ సీటును కేటాయిస్తారు. తక్కువ లగేజీతో ప్రయాణించే వారు వారు పొందుతున్న సేవలకు మాత్రమే చెల్లించేలా ఈ టికెట్ విధానాన్ని డిజైన్ చేసినట్లు తెలిపింది.

# వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు..



వాణిజ్య, పారిశ్రామిక వినియోదారులకు కాస్త ఊరటనిచ్చే వార్త. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి, ఎల్పీజీ సరఫరా మెరుగుపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. దీంతో దిల్లీలో ఒక్క సిలిండర్ రూ.2,930కి లభ్యంకానుంది. ఇన్నిరోజులు ఆ ధర రూ.3,113గా ఉంది. ఇప్పటికే హోటళ్లు, రెస్టారంట్లు వంటి వాణిజ్య వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్రం తొలగించిన సంగతి తెలిసిందే. యుద్ధ సంక్షోభానికి ముందున్న స్థాయికి సరఫరాల్ని పునరుద్ధరించింది. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి పెరగడం, విదేశాల నుంచి దిగుమతి స్థాయిలు మెరుగుపడటం వంటి పరిణామాల నేపథ్యంలో ఆంక్షలను సడలించినట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రకటన చేసింది. మరోవైపు ప్రైవేటు రంగ ఇంధన సంస్థ నయారా ఎనర్జీ కూడా పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5, డీజిల్‌పై రూ.3 ధర తగ్గించింది. ఇక, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో చమురు సంస్థలు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ధర ఒక లీటర్‌పై రూ.5 తగ్గించా యి. దీంతో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.115 నుంచి 110కి పడిపోయింది. దేశీయంగా రాకపోక లు సాగించే విమానసంస్థలకు ఈ తగ్గింపు వర్తించనుంది.




## మెరిసిన ఎంబాపె.. స్వీడన్‌పై ఫ్రాన్స్ విజయం



ఫిఫా వరల్డ్‌కప్‌లో ఫ్రాన్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో స్వీడన్‌ను 3–0 తేడాతో ఓడించింది. ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె (Mbappe) మరోసారి మెరిశాడు. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించాడు. 45వ నిమిషంలో తొలి గోల్ కొట్టగా.. 74వ నిమిషంలో మరొకటి సాధించాడు. 53వ నిమిషంలో బర్కోలా ఓ గోల్ చేశాడు. ఫిఫా ప్రపంచకప్‌లో నాకౌట్ దశలో ఎంబాపె సాధించిన గోల్స్ సంఖ్య ఈ మ్యాచ్‌తో 10కి చేరింది. తద్వారా టోర్నమెంట్ చరిత్రలో నాకౌట్ దశలో అత్యధిక గోల్స్ చేసిన బ్రెజిల్ దిగ్గజాలు లియోనిడాస్, రొనాల్డో నజారియో (8)ల రికార్డును అధిగమించాడు. అదేవిధంగా ఫిఫా వరల్డ్‌కప్ (FIFA World Cup) చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సి (19) రికార్డుకు ఒక గోల్ దూరంలో నిలిచాడు.

## ఓటమితో పునరాగమనం.. ప్రెస్ కాన్ఫరెన్స్‌కు రాని సెరెనాపై ట్రోలింగ్

టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ దాదాపు నాలుగేళ్ల తర్వాత గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగింది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో వింబుల్డన్‌లో పునరాగమనం చేసిన ఈ అమెరికా స్టార్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. తొలి రౌండ్‌లో 20 ఏళ్ల మాయా జాయింట్ చేతిలో సెరెనా ఓడిపోయింది. 23 సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన సెరెనా పునరాగమనంలో మెరుగైన ఆటతీరునే ప్రదర్శించింది. అయితే, ఆస్ట్రేలియాకు చెందిన మాయ 6-3, 6-7(6), 6-3 తేడాతో సెరెనాను ఓడించింది. రెండో రౌండ్‌లో సీనియర్ సెరెనా నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఇరువురూ చెరొకటి గెలిచి సమంగా నిలిచారు. దీంతో నిర్ణయాత్మక మూడో రౌండ్ మరింత ఉత్కంఠగా సాగుతుందని అభిమానులు భావించారు. కానీ, మాయా దూకుడు ముందు సెరెనా నిలవలేకపోయింది. ఈ మ్యాచ్‌ను సెరెనా కుమార్తె ఒలంపియా ప్రత్యక్షంగా వీక్షించింది. సాధారణంగా మ్యాచ్ ముగిసిన తర్వాత ప్లేయర్లు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఉంటారు. కానీ, సెరెనా మాత్రం అలాంటిదేమీ చేయకుండా వెళ్లిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. దీంతో ఆమెపై ట్రోలింగ్ మొదలైంది. వేల డాలర్లు ఖర్చు పెట్టి, వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కించుకుని.. ఇప్పుడు కనీసం ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ మాట్లాడకపోవడం సరికాదంటూ కామెంట్లు వచ్చాయి. ఈ క్రమంలో సెరెనా పేరుతో.. వింబుల్డన్ నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు. "వింబుల్డన్‌లోకి తిరిగిరావడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చాలా మిస్ అయ్యా. మళ్లీ వస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఇక్కడి వాతావరణం అద్భుతంగా ఉంది. బాగా ఆస్వాదించాను. ప్రతిక్షణాన్ని ఎంజాయ్ చేశా" అని సెరెనా వెల్లడించింది.



# 40 ఏళ్లలో తొలిసారి నాకౌట్ విజయం



అమెరికా, కెనడాతో కలిసి ఫిఫా ప్రపంచ కప్ 2026కు ఆతిథ్యం ఇస్తోన్న మెక్సికో అద్భుతం చేసింది. మెగా టోర్నీలో ఈ దేశ జట్టు రౌండ్ 16కు దూసుకెళ్లింది. రౌండ్ 32లో మెక్సికో 2–0 తేడాతో ఈక్వెడార్‌పై విజయం సాధించింది. ఇందులో పెద్ద వింతేముందంటారా? ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో మెక్సికో 40 ఏళ్ల తర్వాత తొలిసారి నాకౌట్ మ్యాచ్‌లో నెగ్గడం విశేషం. చివరిసారిగా 1986లో మాత్రమే విజయం సాధించింది. నాలుగు దశాబ్దాల తర్వాత గెలవడంతో అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి. ఇంగ్లాండ్ vs డీఆర్ కాంగో మ్యాచ్‌లో విజేతతో ప్రికార్టర్స్‌లో మెక్సికో తలపడనుంది. సొంత అభిమానుల మధ్య వరల్డ్ కప్ ఆడుతున్నామనే ధీమా మెక్సికో ప్లేయర్లలో కనిపించింది. గ్రూప్ స్టేజ్‌లోనూ అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరిన ఈ జట్టు.. ఇక్కడా అదే దూకుడును కొనసాగించింది. వర్షం కారణంగా దాదాపు గంటన్నర ఆలస్యంగా ఆట మొదలైంది. అయితే, 22వ నిమిషంలోనే మెక్సికో ఆటగాడు జులియన్ ఖ్వినోనెస్ గోల్ కొట్టాడు. ఆ తర్వాత 31వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ గోల్‌తో ఈ జట్టు ఈక్వెడార్‌పై 2–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం ఇరు జట్లూ గోల్స్ కోసం ప్రయత్నించాయి. ఇందులో మెక్సికోనే ఎక్కువ షాట్లను గురిపెట్టింది. ఆట మరికాసేపట్లో ముగుస్తుందనగా ఈక్వెడార్ ఆటగాడు పియారో హిన్‌కాపీ రెడ్ కార్డ్‌ను ఎదుర్కొన్నాడు. చివరకు మెక్సికో విజయంతో ఈక్వెడార్ ఇంటి ముఖం పట్టింది.

# ఏపీఎల్ విజేత భీమవరం బుల్స్



ఆంధ్ర ప్రిమియర్ లీగ్ (ఏపీఎల్)లో తొలిసారిగా భీమవరం బుల్స్ విజేతగా నిలిచింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన అయిదో సీజన్ ఫైనల్లో ఆ జట్టు 10 వికెట్ల తేడాతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌ను చిత్తు చేసింది. మొదట చెన్నుపాటి రవితేజ (3/22), మోపాడ రవికిరణ్ (1/20), బైలపూడి యశ్వంత్ (1/24), హేమంత్ రెడ్డి (1/17), తోట శ్రావణ్ (1/11), ధాటికి వైజాగ్ లయన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులే చేసింది. త్రిపురణ విజయ్ (39; 25 బంతుల్లో 2×4, 2×6) ఒక్కడే పోరాడాడు. అతను కాకుండా వినయ్ కుమార్ (19), హిమకర్ (17), హనీశ్ రెడ్డి (15) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం ఓపెనర్లు రేవంత్ రెడ్డి (71; 33 బంతుల్లో 10×4, 3×6), హేమంత్ రెడ్డి (59 నాటౌట్; 23 బంతుల్లో 6×4, 4×6) చెలరేగడంతో లక్ష్యాన్ని భీమవరం వికెట్ నష్టపోకుండా కేవలం 9 ఓవర్లలోనే ఛేదించింది. ఫైనల్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. విజేత జట్టుకు రూ.35 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.25 లక్షల ప్రైజ్ మనీ దక్కింది. కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శి సానా సతీష్, విశాఖపట్నం ఎంపీ భరత్ పాల్గొన్నారు.

## క్రికెట్‌లో నీళ్లు మోయించడం కించపర్చడం కాదు: వైభవ్‌పై అశ్విన్ కామెంట్

వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఐర్లాండ్‌తో అవకాశం రాలేదు. ఇవాళ్టి నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఆడనుంది. మరి ఈసారైనా ఈ యువ సెన్సేషన్‌ను ఆడిస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత లేదు. అయితే, ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచుల్లో వైభవ్ వాటర్ బాటిల్స్ ను అందిస్తూ కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో అంత చిన్నపిల్లాడు.. టాప్ క్లాస్ ప్లేయర్‌ను ఇలా వాడుకుంటారా? అని విమర్శలు వచ్చాయి. తాజాగా వీటిపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. "వైభవ్ సూర్యవంశీకి తప్పకుండా అవకాశం వస్తుంది.



కాస్త సమయం పడుతుందంతే. ఐపీఎల్‌లో అతడు ఆడిన తీరు అద్భుతం. అందులో ఎలాంటి సందేహం లేదు. చాలా ప్రత్యేకమైన ఆటగాడు. అయితే, వైభవ్‌తో మంచినీళ్లు మోయించడంపై ఏవో వ్యాఖ్యలు వినిపించాయి.

# వుదయం సినిమా

MOVIE TIME!

## ఏఐ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతున్న 'అంబ's రివెంజ్'



**వుదయం సినిమా** తెలుగు సినీ పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ 'అంబ's రివెంజ్' చిత్రం ముస్తాబవుతోంది. నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్‌పై యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జయవర్ధన్ మడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఐ విజువల్ డిజైన్ & డెవలప్‌మెంట్‌ను 'కాలై విజువల్ స్టూడియోస్' అందిస్తోంది. పూర్తి స్థాయి కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో రూపొందుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. భారత ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ స్ఫూర్తితో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పురాణ గాథను ఆధునిక దృక్పథంతో, అత్యాధునిక ఏఐ సాంకేతికతను మేళవించి వినూత్నంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా నిర్మాత యోగేంద్ర పొట్లూరి, దర్శకుడు జయవర్ధన్ మడి మాట్లాడుతూ, తెలుగు సినిమాకు ఇది ఒక కొత్త ప్రయోగాత్మక అధ్యాయానికి నాంది అని తెలిపారు.

## 'రావు బహదూర్'తో నా కల నెరవేరింది..

**వుదయం:** సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమ రిస్తున్నారు.



**ఇది కంప్లీట్ సైకాలజికల్ డ్రామా.** (రావు బహదూర్ జానర్ ఏమిటి?)

**రావు బహదూర్ జానర్ ఏమిటి?**
ఇది కంప్లీట్ సైకాలజికల్ డ్రామా. మ్యాజికల్ రియలిజం, డార్క్ కామెడీ సబ్‌జానర్స్‌గా ఉంటాయి. ఏదైనా మెటాఫర్‌ను విజువల్‌గా చేసి చూపించడం మ్యాజికల్ రియలిజం.

**ఈ కథ అనుకున్నప్పుడే మీ క్యారెక్టర్ మేకప్ ఇంత ఛాలెంజింగ్‌గా ఉంటుందని అనుకున్నారా?**
మనం మామూలుగా చేసే సినిమాల కంటే 300 శాతం ఎక్కువగా ఈ సినిమాకు కష్టపడాలని తెలుసు.

**ఇది మీ కెరీర్‌లో మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్ కదా?**
అవును. మొన్నటి వరకు నా కెరీర్‌లో 'జ్యోతిలక్ష్మి'కి ముందు, తర్వాత అని చూసుకునేవాడిని. ఇప్పుడు 'రావు బహదూర్'కి ముందు, రావు బహదూర్‌కి తర్వాత అన్నట్టుగా చూస్తారని నమ్ముతున్నాను.

**రావు బహదూర్‌లో రామప్ప క్యారెక్టర్‌కు ఉన్న రిఫరెన్స్ ఏంటి?**
నిజానికి రావు బహదూర్‌లో రామప్ప క్యారెక్టర్‌కు ఎలాంటి రిఫరెన్స్ లేదు. రామప్ప వెరీ మ్యాడ్ క్యారెక్టర్.

**ఇది ఏ టైం పీరియడ్ సినిమా?**
1960–99 మధ్య జరిగే కథ. ఇందులో కథానాయకుడు దేశసంచారి. తను అలా సంచారం చేస్తూ మళ్లీ తన ప్యాలెస్ భువనాలయంకి వచ్చినప్పుడు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయనేది ఆసక్తికరం.

**ఇందులో యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయా?**
యాక్షన్ సీక్వెన్స్‌లు లేవు గానీ, యాక్టింగ్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. ఒక పాట కంప్లీట్‌గా రోప్‌పై ఉంటుంది. ఇందులో రిలీజ్ అయిన వాటితో పాటు ఇంకా మూడు పాటలు ఉన్నాయి. అందులో రెండు డాన్స్ నంబర్స్. నా కెరీర్ లో ఫస్ట్ టైం ఇంతాలా డ్యాన్స్ చేసిన సినిమా ఇదే. ఈ సినిమా కోసం సాల్సా కూడా నేర్చుకున్నాను.

**రావు బహదూర్'పై మీ టీమ్ అందరూ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు... కారణం?**
సినిమా చూసిన తర్వాత వచ్చిన నమ్మకం ఇది. మేము సినిమా మొదలుపెట్టినప్పుడు "మునుపెన్నడూ చూడని విధంగా తెలుగు సినిమా" అనే ట్యాగ్‌లైన్‌ను అనుకున్నాము.

## నాగబంధం ష్యూర్‌షాట్ బ్లాక్‌బస్టర్



**వుదయం సినిమా :** విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ విజువల్ వండర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషబ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. నిర్మాత సురేష్ బాబు ఈ వేడుకకు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ...అందరికి నమస్కారం. నటుడిగా మీ అందరి గుండెల్లో స్థానం సంపాదించుకోవడానికి ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశాను. సినిమా చూస్తే నేను ఎంత హార్డ్‌వర్క్ చేశానో మీకు అర్థమవుతుంది. మీ గుండెల్లో చోటు సంపాదించుకోవడానికి ఏం చేయాలో 100 శాతం ఈ సినిమాకు చేశాను. నాకు ఇంత పెద్ద ప్రాజెక్ట్ ఇచ్చిన అభిషేక్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఆయన అద్భుతంగా ఈ సినిమాను తీశారు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు, కంటెంట్ చూపించినప్పుడు నేను షాక్ అయ్యాను. ఈ సినిమాలో ప్రతిదీ ఒక అద్భుతంలా కనిపిస్తుంది. మాస్ పల్స్ తెలిసిన దర్శకుడు సినిమా తీస్తే ఎలా ఉంటుందో ఇందులో మీరు చూస్తారు. మా నిర్మాతలు కిషోర్ గారు, నిశిత గారు సినిమాను అద్భుతంగా నిర్మించారు. అనంత పద్మనాభస్వామి రథయాత్ర ఎంత గ్రాండ్ సక్సెస్ అయిందో మీరందరూ చూస్తున్నారు. అందరూ కూడా మా ప్రాంతానికి తీసుకురావాలని అడుగుతున్నారు. ఇంత పెద్ద స్థాయిలో పబ్లిసిటీ జరగడానికి ప్రధాన కారణం మా నిర్మాతలు, ముఖ్యంగా నిశిత గారు. ఆమె లేకపోతే ఈ సినిమాకు ఇంత పబ్లిసిటీ వచ్చేదని నేను అనుకోను. ఇలాంటి నిర్మాతలకు ప్రేక్షకులు సపోర్ట్ చేస్తే మరిన్ని అద్భుతమైన సినిమాలు వస్తాయి. మా డీవోపీ ప్రతి డీటెయిల్‌ను అద్భుతంగా చిత్రీకరించారు.

## 'హ్యాంగ్‌మెన్' ట్రైలర్ లాంచ్

**వుదయం సినిమా :** అజయ్ మైసూర్ ప్రొడక్షన్స్, క్లోరో ఫిల్మ్ బ్యానర్ల మీద బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో విహాన్ తెరకెక్కించిన చిత్రం 'హ్యాంగ్‌మెన్'. వి. శ్రీకాంత్, అజయ్ మైసూర్, వి. హెచ్. రావు నిర్మించిన ఈ మూవీకి కమ్రాన్ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాకి ఉదయ్ గుర్రాల కెమెరామెన్‌గా, ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారు. ఈ మూవీ జూలై 3 నుంచి సన్ నెక్ట్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఈక్రమంలో మంగళవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి పద్మశ్రీ డా. బ్రహ్మానందం, నందినీ రెడ్డి, అద్దంకి దయాకర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బ్రహ్మానందం మాట్లాడుతూ .. ''హ్యాంగ్‌మెన్' అనే టైటిల్ చూసి ఈ ఈవెంట్‌కు రావాలని నిర్ణయించుకున్నాను. దీన్ని ఎలాంటి ఉద్యోగం అనాలో కూడా నాకు తెలీడం లేదు. ఉరి తీసే వ్యక్తి జీవన విధానం ఎలా ఉంటుంది? అని అనుకుంటూ ఉంటాను. అతని మానసిక వ్యథ ఎలా ఉంటుంది? అనే దాన్ని విహాన్ చక్కగా పట్టుకున్నాడు. అసలు ఇలాంటి ఆలోచన రావడమే గొప్ప విషయం. బ్రహ్మాజీ మంచి విషయం ఉన్న నటుడు. ఎలాంటి పాత్రనైనా పండించగల సత్తా ఉన్న నటుడు. అతనికి ఇంత వరకు సరైన కారెక్టర్ పడలేదే అని నేను అనుకుంటూ ఉంటాను.




## "సమ్మర్ హాలిడేస్" సినిమాలోని 'క్రష్..' సాంగ్ లాంచ్



**వుదయం సినిమా :** కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి క్రష్ సాంగ్‌ను హీరో ఆనంద్ దేవరకొండ, డైరెక్టర్ ఆదిత్య హాసన్, ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ చేతుల మీదుగా హైదరాబాద్ లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైటర్ కొండల్ రావు మాట్లాడుతూ "సమ్మర్ హాలిడేస్" సినిమాకు ఆర్నెళ్లు వర్క్ చేశాం. ఆ ఆరు నెలలు ఎలా గడిచిపోయాయో తెలియదు. అంత హ్యాపీగా టీమ్ అంతా ఈ మూవీకి పనిచేశాం. రీసెంట్ గా టీజర్ రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇప్పుడు క్రష్ సాంగ్ పెద్ద హిట్ అవుతుందనే వైబ్స్ కనిపిస్తున్నాయి. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురుచూస్తున్నాం. అన్నారు. లిరిసిస్ట్ కిట్టూ విస్సాప్రగడ మాట్లాడుతూ ఈ సినిమాకు మేమంతా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాం. కొన్ని పాటలు మన జ్ఞాపకాలను గుర్తుచేస్తాయి. కానీ ఈ పాట మన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

## ఘనంగా ప్రారంభమైన 'నిమ్మకాయ.. నీకెందుకు భయం'

**వుదయం సినిమా :** కథా ఆధునిక కాలంలోనూ మూఢనమ్మకాలను ఎండగట్టే ఉత్కంఠ రేపుతూ ఆసక్తికరంగా సాగే కథనంతో తెలుగు తెరపైకి ఓ సినిమా రాబోతుంది. రాజేష్ భూపతి, స్వప్నరాజ్, అబిత హీరో హీరోయిన్లుగా, ప్రముఖ నటుడు సుమన్, ఆమని ప్రధాన పాత్రల్లో, బి.వి.సి ఫిల్మ్స్ బ్యానర్‌పై, 'Eట్లు' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న రోశిరెడ్డి పందిళ్లపల్లి దర్శకుడిగా . విభిన్న కథా చిత్రం 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని అమీర్‌పేట సారథి స్టూడియోస్‌లో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి పీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్లాప్ కొట్టారు. లయన్ వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేయాగా, తొలి షాట్ కు టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ దర్శకత్వం వహించారు. పలువురు అతిథులు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడుతూ, "ఈ సినిమా కథలో హారర్, థ్రిల్లర్ అంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. కథ నాకు బాగా నచ్చింది. ఇందులో నటి ఆమనితో కలిసి నటించడం ఆనందంగా ఉంది.



## భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్'



**వుదయం సినిమా :** రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ 'లేడీస్ & లేడీస్' పేరుతో ఓ పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తిని పెంచారు. ఈ వీడియోలో టాక్సిక్ ప్రపంచాన్ని శాసించే మహిళా పాత్రలను పరిచయం చేస్తూ, కథలో వారి ప్రాధాన్యతను చూపించారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ ఒక్కో ఫ్రేమ్‌లో తమ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. నయనతార పవర్ ఫుల్ పాత్రలో కనిపించగా, కియారా అద్వానీ మిస్టీరియస్, ఎమోషనల్ షేడ్స్‌తో మెస్మరైజ్ చేసింది. తారా సుతారియా తన స్టైలిష్ అటిట్యూడ్‌తో మెప్పించగా, రుక్మిణి వసంత్ ఇనేత్న్న కూడిన పాత్రలో కనిపించింది. హుమా ఖురేషీ కూడా తన డాషింగ్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళ కోణంలో సాగే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ వీడియోకు మరింత మిస్టరీని జోడించింది. వీడియో ప్రారంభంలోనే "పిల్లలు... దూరంగా ఉండండి. తల్లిదండ్రులు... మీ పిల్లలను దూరంగా ఉంచండి. తాతలు, బామ్మలు... మీ మనవళ్లను కూడా దూరంగా ఉంచండి. ముత్తాతలు... మీ సొంత రిస్క్‌పై చూడండి" అనే డిస్క్లైమర్‌తో సినిమాకు ఉన్న బోల్డ్ టోన్‌ను ఆసక్తికరంగా పరిచయం చేశారు. స్టైలిష్ విజువల్స్, పవర్‌ఫుల్ యాక్షన్, మిస్టరీతో 'టాక్సిక్' మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. యాక్షన్‌తో పాటు బలమైన మహిళా పాత్రలకు కూడా సమాన ప్రాధాన్యత ఉంటుందని ఈ వీడియో స్పష్టం చేసింది.

## "ముపాపా" ఓ వినూత్నమైన థియేట్రికల్



**వుదయం:** బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ ఆయుష్మాన్ ఖురానా హీరోగా యశ్ రాజ్ ఫిల్మ్స్, పోషమ్ పా పిక్చర్స్ బ్యానర్స్‌పై రూపొందుతోన్న చిత్రం 'ముపాపా'. యశ్ రాజ్ ఫిల్మ్స్ సిఇఒ అక్షయ్ విదాని ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇండియన్ మూవీస్‌లో ప్రముఖ షో రన్నర్, డైరెక్టర్ సమీర్ సక్సేనా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన నిర్మించిన గత చిత్రం సయారా హయ్యస్ట్ గ్రాసర్ సాధించిన రొమాంటిక్ మూవీగా ఇండియన్ సినిమాలో రికార్డ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ముపాపా చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 19న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలియజేశారు.ఇండియన్ ఎంటర్‌టైన్మెంట్ ఇండస్ట్రీలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న పోషమ్ పా పిక్చర్స్ నేటి తరం ప్రేక్షకులకు భిన్నమైన, సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించాలనే లక్ష్యంతో యశ్ రాజ్ ఫిల్మ్స్‌తో కలిసి సినిమాలను నిర్మించనుంది. అందులో భాగంగా ముపాపా సినిమా ప్రారంభమవుతోంది.

## 'అమీర్ లోగ్'ను భారీ ఎత్తున రిలీజ్



**వుదయం సినిమా :** రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్:ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా మేకర్స్ 'లేడీస్ & లేడీస్' పేరుతో ఓ పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తిని పెంచారు. ఈ వీడియోలో టాక్సిక్ ప్రపంచాన్ని శాసించే మహిళా పాత్రలను పరిచయం చేస్తూ, కథలో వారి ప్రాధాన్యతను చూపించారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ ఒక్కో ఫ్రేమ్‌లో తమ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. నయనతార పవర్ ఫుల్ పాత్రలో కనిపించగా, కియారా అద్వానీ మిస్టీరియస్, ఎమోషనల్ షేడ్స్‌తో మెస్మరైజ్ చేసింది.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.